జిల్లావాసులకు కలెక్టర్ శుభాకాంక్షలు



జిల్లా ప్రజలకు కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. 2025లో జిల్లా అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు, ప్రభుత్వ లక్ష్యాలు నెరవేర్చేందుకు ప్రజలందరూ సహకరించాలని కోరారు. జిల్లాను స్వచ్ఛ సుందరంగా తీర్చిదిద్దేందుకు, రక్తహీనత నివారణకు పటిష్ఠ చర్యలు తీసుకుంటున్న తెలిపారు. తనను కలుసుకోవడానికి వచ్చే ప్రజలు, అధికారులు, బొకేలు, స్వీట్లు తీసుకురావద్దని తెలిపారు. రక్తహీనత నివారణకు విరాళాలు అందించాలని కోరారు. బాలిక శిశు అభివృద్ధి నిధి ఖాతాకు (069901000332) తోచిన మొత్తం జమ చేయొచ్చన్నారు. పౌష్టికాహార సామగ్రి అందించొచ్చని, రక్తహీనత కలిగిన వారిని దత్తత తీసుకోవచ్చని పేర్కొన్నారు.

నూతన సందడి

- జిల్లావాసుల్లో సరికొత్త ఉత్సాహం
- అర్ధరాత్రి నుంచే వేడుకలు ప్రారంభం
- అంతటా పండగ వాతావరణం
- ఆశలు ఫలించాలి..

మన్యం మురవాలని కోరుకుంటున్న ప్రజలు

వివిధ వర్గాల అభిప్రాయాలు ఇలా..



గాయకుడిగా గుర్తింపు పొందాలని..

ప్రభుత్వ ఉద్యోగం చేసుకుంటూ నూతన సంవత్సరంలో అధికారుల ఆగ్రహానికి గురికాకుండా ఉండాలని అనుకుంటున్నా. మరిన్ని జానపద గేయాలు ఆలపించి.. మంచి గాయకుడిగా కూడా గుర్తింపు పొందాలనుకుంటున్నా.

- ఎల్.ఉమామహేశ్వరరావు, ఏఈ, హౌసింగ్, జియ్యమ్మవలస మండలం

ప్రభుత్వ ఉద్యోగం సాధించాలి



బీఎస్సీ కంప్యూటర్ పూర్తి చేశాను. ఈ నూతన సంవత్సరంలో కచ్చితంగా ప్రభుత్వ ఉద్యోగం సాధించేలా చూడాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నా. 2025 నా జీవితంలో మరపురాని సంవత్సరంగా నిలవాలి.

- బి.ఇందుమతిదేవి, విద్యార్థి, చినమేరంగి

గ్రూప్-2 ఉద్యోగమే లక్ష్యం



మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో వలంటీర్‌గా పనిచేస్తున్నా. గ్రూప్-2 ఉద్యోగం సాధించడమే లక్ష్యంగా చదువుతున్నా. 2025లో గ్రూప్-2 సెలక్ట్ అవుతాననే నమ్మకం ఉంది.

- వావలపల్లి విశ్వేశ్వరరావు, నడుకూరు, వీరఘట్టం మండలం

గిరిజన అభ్యున్నతికి కృషి



నూతన సంవత్సరంలో గిరిజనుల సంక్షేమం, అభ్యున్నతికి మరింత కృషి చేస్తా. వారి సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్తా.

- ఆరిక చంద్రశేఖర్, గిరిజనాభ్యుదయ సంఘం అధ్యక్షుడు, రావాడ రామభద్రపురం

పార్వతీపురం, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): కాలచక్రం గిర్రున తిరిగిపోయింది.. చూస్తుండగానే కాలగర్భంలో మరో ఏడాది కలిసిపోయింది. ఎన్నో జ్ఞాపకాలను మిగిల్చి 2024 కనుమరుగైంది. కోటి ఆశలు.. కొంగొత్త ఆకాంక్షలతో మరో వసంతం మన ముందుకొచ్చింది. 2024కు వీడ్కోలు చెబుతూ.. 2025కు జిల్లావాసులు ఘన స్వాగతం పలికారు. కొన్నిచోట్ల మంగళవారం అర్ధరాత్రి కేక్‌లను కట్‌చేసి యువత సందడి చేశారు. బుధవారం నుంచి ప్రారంభమవుతున్న నూతన ఏడాదిలో అందరికీ మంచి జరగాలని జిల్లా ప్రజలు భగవంతుడిని ప్రార్థించారు. క్రైస్తవులు అర్ధరాత్రి దాటిన వరకు చర్చిలు, ప్రార్థన మందిరాల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. నూతన ఏడాది అన్ని రకాలుగా కలిసి రావాలని, కూటమి ప్రభుత్వం ఆధ్వర్యం లో జిల్లా మరింతగా అభివృద్ధి చెందాలని మన్యం వాసులు ఆశిస్తున్నారు. మొత్తంగా జిల్లా అంతటా సందడి వాతావరణం నెలకొంది.



ముగ్గుల కోసం మార్కెట్లో రంగులు ఇలా..

ఊపందుకున్న వ్యాపారాలు..

సాలూరు రూరల్: నూతన సంవత్సర వేడుకల నేపథ్యంలో జిల్లాలో వివిధ వ్యాపారాలు ఊపందుకున్నాయి. పుష్పగుచ్ఛాలు, స్వీట్లు, పండ్లు, బేకరీ షాపులు కొనుగోలుదారులతో కిటకిటలాడాయి. మరోవైపు ఆపిల్, ఆరెంజ్, కేకులు, శీతలపానియాలు, డైరీల విక్రయాలు జోరుగా సాగాయి. డిసెంబరు 31 మంగళవారం కావడంతో మాంసాహార హోటల్స్‌కు డిమాండ్ ఏర్పడింది. దీంతో హోటల్స్ వారు బిర్యానీ తదితర వాటికి ఆఫర్స్ ప్రకటించారు. మరోవైపు అర్ధరాత్రి వరకు మద్యం విక్రయాలు సాగాయి. దీంతో మందుబాబులతో మద్యం దుకాణాలు రద్దీగా మారాయి.



సాలూరులో విక్రయానికి సిద్ధంగా ఉన్న బొకేలు

ఆశ్రమ పాఠశాలలో మంత్రి సందడి

సాలూరు రూరల్: నూతన సంవత్సర వేడుకల్లో భాగంగా గిరిజన విద్యార్థులతో కలిసి మంత్రి గుమ్మిడి సంధ్యారాణి సందడి చేశారు. మంగళవారం రాత్రి కొత్తవలస గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలను ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా గిరిజన విద్యార్థులతో కలిసి థింసా నృత్యం చేశారు. వారితో కాసేపు సంతోషంగా గడిపారు. గిరిజన విద్యార్థులపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటుందన్నారు. కొత్త సంవత్సరం అందరికీ మేలు జరగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు సంధ్యారాణి, ఆశ్రమ పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



కొత్తవలస ఆశ్రమ పాఠశాలలో గిరిజన విద్యార్థినులతో కలిసి థింసా నృత్యం చేస్తున్న మంత్రి సంధ్యారాణి

రక్తహీనత విముక్త జిల్లాయే లక్ష్యం

- అధికారుల సమావేశంలో కలెక్టర్ శ్యామ్ ప్రసాద్

పార్వతీపురం, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): నూతన సంవత్సరంలో జిల్లాను రక్తహీనత నుంచి విముక్తి కల్పించడమే లక్ష్యంగా పనిచేయాలని కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో సంబంధిత అధికారులతో ఆయన మాట్లాడుతూ.. 'రక్తహీనత, మాతాశిశు మరణాల నియంత్రణ, విద్య, వైద్యం, ఇళ్ల నిర్మాణం, మౌలిక సదుపాయాలపై జిల్లా యంత్రాంగం దృష్టి సారించింది. ప్రధానంగా రక్తహీనత నివారణకు గ్రామస్థాయిలో కమిటీలు ఏర్పాటు చేశాం. దీనిపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం. గుమ్మలక్ష్మీపురం, సాలూరుతో పాటు సీతంపేటలో కూడా గిరిజన గర్భిణుల వసతిగృహం కొనసాగుతుంది. సాలూరు మండలం కరడవలసలో కంటైనర్ ఆసుపత్రిని ఏర్పాటు చేశాం. త్వరలో కురుపాం, పాలకొండ నియోజక వర్గాల్లో వాటిని ప్రారంభిస్తాం. హాస్టళ్లలో విద్యార్థుల ఆరోగ్యాలపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తాం. సాంఘిక సంక్షేమ హాస్టళ్ల మరమ్మతుల కోసం సుమారు రూ.189 లక్షలు మంజూరయ్యాయి. రూ.29.61 కోట్లతో 31.72 కిలోమీటర్ల మేర 19 రోడ్లు నిర్మిస్తున్నాం. ఉపాధి మెటీరియల్ కాంపోనెంట్ కింద రూ.2.11 కోట్లతో దాదాపు 472 అభివృద్ధి పనులు మంజూరయి. ఇప్పటికే రూ.102 కోట్లు వెచ్చిచ్చాం. 190 బీటీ రోడ్లు, రక్షణగోడల కోసం రూ.570 కోట్లు అవసరమని అంచనా వేశాం. దాదాపు 713 రెవెన్యూ సదస్సులు పూర్తయ్యాయి. 4,660 దరఖాస్తులు వచ్చాయి. వాటిని పరిశీలించి సమస్యలు పరిష్కరిస్తాం. బహిరంగ మలవిసర్జన రహిత సమాజం, స్వచ్ఛ జిల్లాయే ధ్యేయంగా పనిచేస్తున్నాం.' అని తెలిపారు. అనంతరం కలెక్టరేట్‌లో ఇటీవల ఏర్పాటు చేసిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) రిసెప్షన్ సెంటర్‌ను కలెక్టర్ పరిశీలించారు. ప్రజలు రోజూ మధ్యాహ్నం మూడు నుంచి నాలుగు గంటల మధ్య ఇక్కడ అర్జీలు ఇవ్వొచ్చని తెలిపారు. పీజీఆర్ఎస్ సెంటర్‌కు వచ్చే వారికి తాగునీరు, టీ ఇవ్వాలని సిబ్బందిని ఆదేశించారు. ఎస్సీ, ఎస్టీ వర్గాలపై జరిగిన దాడుల కేసుల్లో బాధితులకు త్వరగా నష్టపరిహారం చెల్లించాలని కలెక్టర్ ఆదేశించారు.

వాటర్ గ్రిడ్‌కు ప్రతిపాదనలు

'జిల్లాలోని 1,987 గ్రామాలకు తాగునీరు సరఫరా చేసేందుకు రూ.1452 కోట్లతో వాటర్ గ్రిడ్ నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేశాం. ఈ ప్రాజెక్టుకు త్వరలోనే టెండర్లు పిలుస్తాం. రూ.30 కోట్లతో జంగిల్ క్లియరెన్స్ కింద 95 పనులు చేపట్టాం. 2025 ఫిబ్రవరి నాటికి అవి పూర్తికానున్నాయి. నీతి అయోగ్ ఆశావహ బ్లాక్ కింద భామిని బ్లాక్ దక్షిణ భారతదేశంలో ప్రగతిలో ప్రథమ స్థానంలో నిలిచింది. రూ.1.50 కోట్లు ప్రోత్సాహకంగా లభించింది.' అని కలెక్టర్ వెల్లడించారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్, ఎస్పీ

మాదక ద్రవ్యాల నివారణకు చర్యలు

- మాదక ద్రవ్యాల రవాణా, విక్రయం, సరఫరా చేసేవారికి శిక్షలు పడేలా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. జిల్లా స్థాయి మాదక ద్రవ్యాల నియంత్రణ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. అటవీ ప్రాంతం గుండా జరిగే రవాణాకు ఆశాఖాధికారులు అడ్డుకట్ట వేయాలన్నారు. విద్యా సంస్థలపై మాదక ద్రవ్యాల ప్రభావం పడకుండా చూడాలన్నారు. గంజాయి సాగు చేసే వారికి ప్రభుత్వపథకాలను నిలుపుదల చేస్తామని తెలిపారు. ఎస్పీ మాధవరెడ్డి మాట్లాడుతూ.. మాదక ద్రవ్యాలు, మత్తు పదార్థాల నియంత్రణకు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశామని తెలిపారు. ఇప్పటివరకు 49 మందిని అదుపులోకి తీసుకున్నామని, తొమ్మిది వాహనాలను సీజ్ చేసినట్టు చెప్పారు.
- జిల్లాలో ద్విచక్ర వాహనాలకు హెల్మెట్‌ధారణ తప్పనిసరి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ధరించని వారి నుంచి అపరాధ రుసుం వసూలు చేయాలన్నారు. అతివేగం వల్ల జరిగే ప్రమాదాలు గురించి అందరికీ తెలిసేలా పోస్టర్లను అతికించాలని సూచించారు. క్షతగాత్రులను దగ్గరలోని ఆసుప త్రిలో చేర్పించే వారికి అవార్డులు ప్రకటించాలన్నారు. జిల్లాలో గర్భస్థ శిశు లింగ నిర్ధారణ పక్కాగా అమలు చేయాలని తెలిపారు. సమాజంలో మగ, ఆడ శిశు నిష్పత్తి సమానంగా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. లింగ నిర్ధారణ పరీక్షలకు ఎవరూ వెళ్లరాదన్నారు.

ఒకరోజు ముందుగా..

- 94 శాతం పింఛన్ల పంపిణీ
- భాగస్వాములైన అధికారులు, ప్రజాప్రతినిధులు

పార్వతీపురం/సాలూరు/ సాలూరు రూరల్/గరుగుబిల్లి, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): నూతన సంవత్సరం ప్రారంభానికి ఒకరోజు ముందుగానే జిల్లాలో లబ్ధిదారులకు ఎన్టీఆర్ భరోసా పింఛన్లు అందించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు మంగళవారం అధికారులు, ప్రజాప్రతినిధులు నేరుగా లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి.. పింఛన్ సొమ్ము అందజేశారు. 'మన్యం'లో వివిధ రకాల పింఛన్లు 1,40,933 ఉండగా.. తొలిరోజు 1,32,704 మందికి సుమారు రూ.55.50 కోట్లు పింఛన్ల రూపంలో అందించారు. జిల్లాలో 107 మందికి కొత్తగా స్పౌజ్ పింఛన్లు అందించారు. కొన్నిచోట్ల సిగ్నల్ సమస్య ఉండడంతో గ్రామాల బయట పంపిణీ చేపట్టారు. మొత్తంగా 94 శాతం పింఛన్ల పంపిణీ పూర్తయినట్లు డీఆర్‌డీఏ పీడీ వై.సత్యంనాయుడు తెలిపారు.

ఏడు కిలోమీటర్లు నడిచి, కొండలెక్కి..

సుమారు ఏడు కిలోమీటర్లు నడిచి కొండలెక్కి. సాలూరు మండలం ఏవోబీ పరిధి కొదమ పంచాయతీలో ఉన్న చింతామల, లొద్ద, బందపాయి గ్రామాలకు పంచాయతీ కార్యదర్శి అనిరుధ్ చేరుకున్నారు. చింతామల, లొద్ద, బందపాయిల్లో 98 మంది సామాజిక పింఛన్‌దారులకు మధ్యాహ్నంలోగా పింఛను సొమ్ము అందించారు. సువర్ణముఖీ నది దాటి సుల్లరి గ్రామానికి వీపీఏ తేజస్విని నడిచి వెళ్లి పింఛన్లు పంపిణీ చేశారు. గిరిశిఖరాల్లో ఉన్న కొదమ, పట్టుచెన్నారు, పగులుచెన్నారు, మారయ్యపాడు, కొఠియా గ్రూప్ గ్రామాలకు పంచాయతీ కార్యదర్శులు, మహిళా పోలీసు, వ్యవసాయ సహాయకులు, వెల్ఫేర్ అసిస్టెంట్లు తదితరులు వెళ్లి పింఛన్లు అందజేశారు. ఒకరోజు ముందుగానే పింఛను డబ్బులు అందడంతో లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేశారు.



కొండలెక్కి పింఛన్లు పంపిణీకి వెళ్తున్న పంచాయతీ కార్యదర్శులు



గొట్టివలసలో పింఛన్లు అందిస్తున్న సచివాలయ సిబ్బంది

అర్హులందరికీ పింఛన్లు: మంత్రి

సాలూరు పట్టణంలో 19, 20 వార్డుల్లో మంత్రి గుమ్మిడి సంధ్యారాణి పింఛన్లు పంపిణీ చేశారు. అర్హులందరికీ ఎన్టీఆర్ భరోసా కింద పింఛన్ అందుతుందని తెలిపారు. ఈ సందర్భంగా ప్రజలు పలు సమస్యలను మంత్రి దృష్టికి తెచ్చారు. తన కుమారుడు బింగు మహేష్‌కు కళ్లు కనిపించడం లేదని దివ్యాంగ పింఛన్ మంజూరు చేయాలని 19వ వార్డుకు చెందిన సత్యవతి కోరారు. ఒంటరి మహిళనైన తనను ఆదుకోవాలని వేడుకున్నారు. 15 ఏళ్లుగా మంచానికే పరిమితమైన పల్లవికి కేవలం దివ్యాంగ పింఛన్ మాత్రమే ఇస్తున్నారని, రూ.పదివేలు పింఛన్ అందించాలని కుటుంబ సభ్యులు విన్నవించారు. అన్ని అర్హతలు ఉన్నప్పటికీ సదరంలో ఎందుకు అనర్హతగా చూపుతున్నారో తెలుసుకుంటానని, దీనిపై జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారులతో మాట్లాడుతానని మంత్రి తెలిపారు.

గ్రీటింగ్.. చీటింగ్

- న్యూ ఇయర్ విషెష్ లింక్‌లతో భద్రం
- ఓపెన్ చేస్తే అంతే సంగతులు
- ఒకే క్లిక్‌తో ఖాతాల్లో డబ్బులు మాయం
- అప్రమత్తంగా ఉండాలంటున్న పోలీసులు



8లో

కూటమి చొరవతో సౌరభాలు

- ఎస్టీ, ఎస్సీ గ్రామాల్లో వెలుగులు నింపేందుకు కార్యాచరణ
- ప్రభుత్వ ఆదేశాలతో ఇప్పటికే సర్వే పూర్తి
- యూనిట్ ధర భరించేందుకు చర్యలు
- జిల్లావాసుల్లో హర్షం



సీతంపేట రూరల్, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): సీతంపేట మన్యంలోని ఎస్టీ, ఎస్టీ గ్రామాలు సౌర వెలుగులతో కళకళలాడనున్నాయి. కూటమి ప్రభుత్వం చొరవతో కొత్తరూపును సంతరించు కోనున్నాయి. ఇప్పటికే అధికారులు సర్వే పూర్తి చేశారు. సూర్యఘర్ పథకం కింద పలు గృహాలను ఎంపిక చేశారు. నివేదికలు సైతం పంపించారు. ఈ మేరకు ప్రభుత్వం ఆయా గ్రామాల్లో సౌర వెలుగులు నింపేందుకు కార్యాచరణ సిద్ధం చేస్తోంది. అవసరమైతే యూనిట్ ధరను కూడా భరించనుంది. మొత్తంగా కూటమి ప్రభుత్వ నిర్ణయంపై జిల్లావాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

కూటమి ముందడుగు..

సౌర విద్యుత్ వినియోగాన్ని పెంచి సామాన్యులపై విద్యుత్ చార్జీల భారం తగ్గించాలనే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం పీఎం సూర్యఘర్ పథకాన్ని ప్రవేశపెట్టింది. అయితే ఈ పథకం వల్ల గిరిజనులకు ఎంతో మేలు చేకూరే అవకాశాలు ఉన్నా.. యూనిట్ ధర ఎక్కువగా ఉండడం, ముందస్తుగా డిపాజిట్ చేయాల్సి ఉండడంతో గిరిపుత్రులు ముందుకు రావడం లేదు. మరోవైపు గిరిశిఖర గ్రామాల్లో ఈ పథకం కింద యూనిట్లు ఏర్పాటు చేసుకునేందుకు అనుకూల పరిస్థితులు లేవు. దీంతో ఏజెన్సీలో సౌర వెలుగులు కానరావడం లేదు. అవగాహన కల్పించాల్సిన అధికారులు ఆ దిశగా ప్రయత్నాలు చేయడం లేదు. అయితే దీనిపై దృష్టి సారించిన కూటమి సర్కారు ఎస్టీ, ఎస్సీల కోసం ముందడుగు వేసింది. ఇటీవల జారీ చేసిన ఆదేశాల మేరకు ఇటీవల కాలంలో విద్యుత్‌శాఖ అధికారులు పాలకొండ నియోజకవర్గంలో రూఫ్‌టాప్ గృహాల సర్వే చేపట్టారు. రూఫ్‌టాప్(శ్లాబు) ఉన్న ఎస్సీ, ఎస్టీ గృహాలు 21,302 ఉన్నట్లు గుర్తించి నివేదిక పంపారు. దీని ఆధారంగా చేసుకొని సూర్యఘర్ పథకం ఏర్పాటుకు అయ్యే యూనిట్ ధరను ఎస్సీ ఎస్టీల కోసం కూటమి ప్రభుత్వం భరించనుంది. ఇదే కార్యరూపం దాల్చితే గిరిజన ప్రాంతాల్లో ఇకపై సౌర వెలుగులు కనిపించనున్నాయి.

నియోజకవర్గంలో ఇలా..

పాలకొండ నియోజకవర్గం పరిధిలోని పాలకొండ, సీతంపేట, భామిని, వీరఘట్టం మండలాల నుంచి సూర్యఘర్ సోలార్ రూఫ్‌టాప్ కోసం 128 దరఖాస్తులు వచ్చాయి. వీటిలో 10 మంది లబ్ధిదారులు చెల్లింపులు చేశారు. వీరఘట్టంలో ఒకరు, పాలకొండలో ఐదుగురు, భామినిలో ఒకరు 20 కిలోవాట్ల సామర్థ్యం కలిగిన సోలార్ రూఫ్‌టాప్‌లను వినియోగిస్తున్నారు. మిగిలిన ముగ్గురు వినియోగదారులు కూడా నగదు చెల్లించారు. వారు కూడా త్వరలో తమ ఇళ్లపై సోలార్ రూఫ్‌టాప్‌లు ఏర్పాటు చేయనున్నారు.

సబ్సిడీ ఇలా..

సూర్యఘర్ పథకం కింద వినియోగదారుడు వన్ కేవీ ప్యానెల్ బోర్డు ఏర్పాటుకు రూ.83 వేలు చెల్లించాలి. అయితే తిరిగి ప్రభుత్వం సబ్సిడీ కింద రూ.30వేలు వినియోగదారుడి ఖాతాకు జమ చేస్తుంది. 2కేవీ ప్యానెల్ బోర్డు కోసం రూ.1.44వేలు చెల్లిస్తే సబ్సిడీ రూపంలో వినియోగదారుడికి తిరిగి రూ.60వేలు చెల్లిస్తారు. గృహ అవసరాల కోసం 2కేవీ రూఫ్‌టాప్ ఏర్పాటు చేసుకుంటే విద్యుత్ బిల్లు ఆదా అవుతుంది. మిగులు కరెంటును విద్యుత్‌శాఖకు విక్రయిస్తే కొంత మొత్తంలో నగదు కూడా వినియోగదారుడికి వచ్చే పరిస్థితి ఉంది. గిరిజన లబ్ధిదారులకు ప్రభుత్వం 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందిస్తోంది. దీంతో సూర్యఘర్‌పై వారు ఆసక్తి చూపడం లేదు. ఇప్పటికరకు సీతంపేట ఏజెన్సీలో 84 మంది 'సూర్యఘర్' కోసం దరఖాస్తు చేసుకున్నారు. అయితే వారిలో ఎవరూ యూనిట్ ఏర్పాటు, డిపాజిట్ చెల్లించడానికి ముందుకు రాలేదు.

ట్రాన్స్‌కో డీఈ ఏమన్నారంటే...

ప్రభుత్వ ఆదేశాల మేరకు ఎస్సీ, ఎస్టీ గ్రామాల్లో సర్వే చేపట్టాం. సూర్యఘర్ పథకంపై అవగాహన కల్పిస్తున్నాం. బ్యాంక్ రుణం కూడా ఇప్పిస్తామని చెబుతున్నాం.' అని ట్రాన్స్‌కో డీఈ గోపాలకృష్ణ తెలిపారు.

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

శాంతి భద్రతల పరిరక్షణకు కృషి

- గంజాయి అక్రమ రవాణాపై ఉక్కుపాదం ● నిబంధనలకు వ్యతిరేకంగా మద్యం అమ్మరాదు
- ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు ● కోడి పందేలు, జూదం నిషేధం ● ఎస్పీ వకుల్ జిందాల్



విజయనగరం, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): 'జిల్లాలో శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేస్తున్నాం. దీనిపై నిరంతర పర్యవేక్షణ ఉంటుంది. గంజాయి అక్రమ రవాణాపై ఉక్కుపాదం మోపుతున్నాం. నిబంధనలకు వ్యతిరేకంగా ఎక్కడా మద్యం విక్రయించరాదు. జిల్లా కేంద్రం విజయనగరంతో పాటు మరికొన్ని ప్రాంతాల్లో ట్రాఫిక్ సమస్య లేకుండా తగిన చర్యలు చేపడుతున్నాం. సంక్రాంతి సందర్భంగా జిల్లాలో కోడిపందేలు, జూదం వంటివి నిర్వహించడాన్ని నిషేధించాం. ఇప్పటికే కొన్ని ప్రాంతాల్లో పందెంరాయుళ్లను గుర్తించాం. అలాంటివారిని బైండోవర్ చేస్తున్నాం. గంజాయి అక్రమ రవాణాలో పట్టుబడిన వారిపై షీట్‌లు ఓపెన్ చేస్తున్నాం.' అని ఎస్పీ వకుల్ జిందాల్ తెలిపారు. నూతన సంవత్సరం సందర్భంగా వివిధ అంశాలపై ఆయన 'ఆంధ్రజ్యోతి'తో మంగళవారం మాట్లాడారు.

● **ప్రశ్న:** జిల్లాలో శాంతిభద్రతల పరిస్థితేంటి.?

● **జవాబు:** ప్రశాంతమైన జిల్లా విజయనగరం. శాంతి భద్రతల పరిరక్షణ అనేది నిరంతర ప్రక్రియ. దీనిపై ఎప్పుడూ పర్యవేక్షణ చేస్తుంటాం. ఉన్నతస్థాయి నుంచి క్షేత్రస్థాయి వరకూ శాంతిభద్రతల పరిరక్షణపై ప్రత్యేక దృష్టి సారించాం. ఎక్కడైనా వివాదాలు, అల్లర్లు జరిగితే వెంటనే సంబంధిత వ్యక్తులను ఆదుపులోకి తీసుకుని కౌన్సిలింగ్ ఇస్తున్నాం. నేర చరిత్ర ఉన్నవారిపై, అల్లర్లకు పాల్పడేవారిపై, రౌడీషీట్స్ ఉన్న వారిపై ప్రత్యేక దృష్టి పెడుతున్నాం.

● **ప్ర:** గంజాయి నిర్మూలనకు చర్యలు చేపడుతున్నారా?

● **జ:** గంజాయి అక్రమ రవాణాపై ఉక్కుపాదం మోపుతున్నాం. ఇప్పటికే జిల్లాలో పలు కేసులు నమోదు చేశాం. గంజాయిని నిర్మూలించేందుకు ప్రత్యేక పోలీసు బృందాలు ఏర్పాటు చేశాం. జిల్లా సరిహద్దుల్లో ఏర్పాటు చేసిన ఐదు చెక్‌పోస్టులు సత్ఫలితాలు ఇస్తున్నాయి.

● **ప్ర:** బెల్టుషాపులపై చర్యలు తీసుకుంటున్నారా?

● **జ:** నిబంధనలకు విరుద్ధంగా ఎక్కడ మద్యం విక్రయాలు జరిగినా సహించేది లేదు. వారిపై చట్ట ప్రకారం చర్యలు ఉంటాయి. ఇందులో ఎటువంటి సందేహం లేదు. బెల్టుషాపుల విషయంలో కూడా కఠిన వైఖరే. బెల్టుషాపుల నిర్వాహకులపై కేసులు నమోదు చేస్తున్నాం. అక్రమ మద్యాన్ని స్వాధీనం చేసుకుంటున్నాం. జాతీయ రహదారులకు ఆనుకుని ఉన్న డాబాల్లో కూడా మద్యం విక్రయాలు, సరఫరా చేయడానికి లేదు.

● **ప్ర:** ట్రాఫిక్ సమస్య ఉందా?

● **జ:** జిల్లా కేంద్రం విజయనగరంలో కొన్ని ప్రాంతాల్లో పార్కింగ్ స్థలాలు లేకపోవడంతో ట్రాఫిక్ సమస్య తలెత్తుతుంది. అయినప్పటికీ ట్రాఫిక్ పోలీసులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసి ట్రాఫిక్ సమస్య లేకుండా చేస్తున్నారు. జిల్లాలోని మరికొన్ని ప్రాంతాల్లో కూడా ట్రాఫిక్ సమస్య నియంత్రణకు చర్యలు చేపడుతున్నాం.

● **ప్ర:** కోడి పందేలు , పేకాట శిబిరాల సంగతేంటి?

● **జ:** సంక్రాంతి పండగ సందర్భంగా జిల్లాలో కోడి పందేలు, పేకాట శిబిరాలు నిర్వహించరాదు. ఎక్కడైనా నిర్వహిస్తే ప్రజలు పోలీసులకు సమాచారం ఇవ్వాలి. వెంటనే పోలీసులు ఆ ప్రదేశాలకు వెళ్లి సంబంధిత వ్యక్తులను ఆదుపులోకి తీసుకుని చట్టపరమైన చర్యలు తీసుకుంటారు. ఇప్పటికే కోడి పందేల నిర్వాహకులను బైండోవర్ చేస్తున్నాం.

● **ప్ర:** జిల్లా ప్రజలకు ఏం చెబుతారు?

● **జ:** జిల్లా ప్రజలకు నూతన సంవత్సర, సంక్రాంతి పండగ శుభాకాంక్షలు. జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణకు గాను పోలీసు వ్యవస్థకు ప్రజలు సహకరించాలి. అపరిచిత వ్యక్తుల సంచారంపై, కోడి పందేలు, జూదం శిబిరాలపై పోలీసులకు సమాచారం ఇవ్వాలి. జీవితాలు నాశనం చేసే గంజాయిని ఈ సమాజం నుంచి వెళ్లగొట్టడానికి జిల్లా ప్రజలు సహకారం ఎంతో అవసరం.

తలసరి ఆదాయం పెంపే లక్ష్యం

- మూడు రంగాలను అభివృద్ధి చేస్తాం ● ప్రాజెక్టుల పూర్తికి రూ.1,800 కోట్లతో ప్రతిపాదనలు
- ప్రతి నియోజకవర్గంలో ఎంఎస్ఎంఈ పార్కు ● కలెక్టర్ బీఆర్ అంబేడ్కర్



విజయనగరం, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): 'జిల్లాలో తలసరి ఆదాయం పెంపే లక్ష్యంగా అడుగులు వేస్తున్నాం. ఇందుకు వ్యవసాయం, పారిశ్రామిక, సేవా రంగాలను ప్రామాణికంగా తీసుకున్నాం. ఈ మూడు రంగాల ద్వారా తలసరి ఆదాయం పెరగడంతో పాటు, జిల్లా అభివృద్ధి కూడా జరగనుంది. జిల్లాలో పెండింగ్ ప్రాజెక్టుల పూర్తికి రూ 1,800 కోట్లతో ప్రణాళిక సిద్ధం చేశాం. కొత్త సంవత్సరం జిల్లా ప్రజలు అన్ని రంగాల్లో ముందుకు వెళ్లాలి.' అని కలెక్టర్ బీఆర్ అంబేడ్కర్ తెలిపారు. నూతన సంవత్సరం సందర్భంగా జిల్లా అభివృద్ధి, తదితర అంశాలపై ఆయన 'ఆంధ్రజ్యోతి'తో మంగళవారం మాట్లాడారు.

ప్రశ్న: తలసరి ఆదాయం పెంపు సాధ్యమేనా?

జవాబు: సాధ్యమే! దీనికోసం వ్యవసాయం, పారిశ్రామిక, సేవా రంగాలను ఎంపిక చేసుకున్నాం. ఈ మూడు రంగాలను అభివృద్ధి చేస్తే తలసరి ఆదాయం పెరుగుదల కచ్చితంగా ఉంటుంది. వ్యవసాయానికి సంబంధించి ఇప్పటికే 2.91 లక్షల హెక్టార్లలో రైతులు పంటలు వేస్తున్నారు. ఇంకా బీడుగా ఉన్న భూములను సైతం వ్యవసాయానికి అనుకూలంగా మారుస్తాం. వరి లాంటి పంటలకు అనుకూలంగా లేకపోతే, వాణిజ్య పంటలు పండించేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం. జిల్లాను పారిశ్రామికంగా అభివృద్ధి చేయాలని నిర్ణయించాం. సేవా రంగానికి సంబంధించి పర్యాటకానికి అధిక ప్రాధాన్యత ఇస్తాం. తాటిపూడి, రామతీర్థం, భోగాపురం మండల పరిధిలో పర్యాటకాభివృద్ధికి కృషి చేస్తున్నాం.

ప్ర: కొత్త పరిశ్రమలు ఏర్పాటు చేస్తారా?

జ: రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలో పారిశ్రామిక అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాం. ప్రతి నియోజకవర్గంలో ఒక ఎంఎస్ఎంఈ పార్కుని ఏర్పాటు చేస్తాం. దీనిద్వారా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయి.

ప్ర: ఎయిర్‌పోర్టు, గిరిజన యూనివర్సిటీ పనులు ఎంతవరకు వచ్చాయి?

జ: భోగాపురం ఎయిర్‌పోర్టు, గిరిజన యూనివర్సిటీ నిర్మాణాలు శరవేగంగా జరుగుతున్నాయి. గత నవంబరు నాటికి ఎయిర్‌పోర్టు పనులు 51 శాతం పూర్తయ్యాయి. ముఖ్యమంత్రి చంద్రబాబు నిర్దేశించిన విధంగా ఎయిర్‌పోర్టు నిర్మాణం పూర్తికానుంది. గిరిజన యూనివర్సిటీ పనులు కూడా నిర్దిష్ట గడువులోగా పూర్తిచేస్తాం. ఈ ఏడాది మార్చి నాటికి పలు భవనాలు అందుబాటులోకి వస్తాయి.

ప్ర: 'పల్లె పండగ' పనులు ఎప్పటికి పూర్తవుతాయి?

జ: పల్లె పండగ కార్యక్రమం పేరిట జిల్లాలో చేపడుతున్న వివిధ అభివృద్ధి పనులు శతశాతం పూర్తి చేయాలని లక్ష్యంగా నిర్ణయించాం. ఈ మేరకు వివిధ స్థాయిల్లో సమీక్షలు నిర్వహించాం. ఇది పనుల వేగవంతానికి ఉపయోగపడింది. 2,112 పనులు చేయాలని నిర్ణయించాం. డిసెంబరు 31 (మంగళవారం) నాటికి ఆయా పనులు 50 శాతానికి చేరుకున్నాయి. మిగతా పనులు కూడా త్వరలో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించాం.

ప్ర: జిల్లాలో ప్రాజెక్టుల పరిస్థితి?

జ: జిల్లాలో పలు ప్రాజెక్టులు వివిధ దశల్లో ఉన్నాయి. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు అన్ని ప్రాజెక్టులకు సంబంధించి డీపీఆర్ (డిటైల్డ్ ప్రాజెక్టు రిపోర్టు)లు సిద్ధం చేశాం. ప్రాజెక్టుల నిర్మాణానికి రూ.1,800 కోట్ల వ్యయం అవుతుందని అంచనా వేసి, ప్రభుత్వానికి నివేదించాం. ప్రభుత్వం ప్రాధాన్యత క్రమంలో నిధులు విడుదల చేసే అవకాశం ఉంది. నిధులు విడుదలైన వెంటనే ప్రాజెక్టుల నిర్మాణానికి కృషి చేస్తాం.

ప్ర: కొత్త సంవత్సరంలో మీ ప్రణాళిక ఏంటి?

జ: జిల్లాను అన్ని రంగాల్లో ముందుకు తీసుకువెళ్లేందుకు కృషి చేస్తా. ఇందుకు ప్రజలు, అధికారులు, ప్రజాప్రతినిధులు సహకరించాలి. అందరి సమష్టి కృషితోనే ఇది సాధ్యం. కొత్త ఏడాది జిల్లా ప్రజలు అంతా బాగుండాలి. అన్ని రంగాల్లో ముందుకు వెళ్లాలి. జిల్లా ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు.

గ్రీటింగ్.. చీటింగ్..

- న్యూఇయర్ విషెష్ లింక్‌లతో భద్రం
- అప్రమత్తంగా ఉండాలంటున్న పోలీసులు



మెళియాపుట్టి, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): నూతన సంవత్సరంలోకి స్వాగతం పలికే వేళ సైబర్ నేరగాళ్ల సరికొత్త మోసాలకు పాల్పడే ప్రమాదముందని పోలీసులు హెచ్చరిస్తున్నారు. గ్రీటింగ్‌ల పేరుతో మోసాలు జరిగే అవకాశముంది. ప్రధానంగా శుభాకాంక్షలు చెప్పే పేరుతో మొబైల్ ఫోన్లకు ఎస్ఎం ఎస్‌లు, వాట్సాప్ ద్వారా పంపించే సమాచారం మాటున మోసానికి పాల్పడే ప్రమాదముంది.ఈనేపథ్యంలో కొత్త సంవత్సరం ప్రారంభయ్యే వేళ అప్రమత్తంగా ఉండాలని పోలీసులు సూచిస్తున్నారు.

క్షణాల్లో నగదు లావాదేవీలు..

సాంకేతికపరిజ్ఞానం ఏ స్థాయిలో పెరిగితే మోసాలు కూడా అదే స్థాయిలో పెరుగుతున్నాయి. ప్రస్తుతం ఇంటర్‌నెట్ యుగంలో బ్యాంకింగ్ సేవలు సులభతరమయ్యాయి. దీంతో క్షణాల్లో నగదు లావాదేవీలు జరుగుతున్న విషయం విదితమే. ప్రస్తుతం మారుతున్న ఆర్థిక,సాంకేతిక వ్యవహారాలపై పరిజ్ఞానం లేకపోవడంతో ఎక్కువగా మోసాలు చోటుచేసుకుంటున్నాయి. కొత్త సంవత్సరం పురస్కరించుకుని బంధువులు, శేయాభిలాషులకు శుభాకాంక్షలు వివిధ రకాల్లో చెబుతున్నారు. కొందరు ఫోన్లల్లో వచ్చే వినూత్నంగా ఆలోచించి వచ్చే చిత్రాలు(ఎమోజు) సందేహలు మెస్‌జ్‌లు పంపిస్తున్నారు. అయితే ఇదే అదనుగా చేసుకొని సైబర్ కేటుగాళ్ల రంగలోకి దిగే పరిస్థితి కనిపిస్తోందని పోలీసులు చెబుతున్నారు. నచ్చేవిధంగా మీ పేరుతో గ్రీటింగ్ సందేహలను పంపుకొవచ్చని పేర్కొంటున్నారు. మీరు కింది లింక్ క్లిక్ చేయాలి చెబుతారు. ఫోన్లకు వాట్సాప్, టెలిగ్రామ్, ఆండ్రాయిడ్ ప్యాకేజీ కిట్ ఫైల్స్ వంటి వాటి ద్వారా మెస్‌జ్‌లు పంపుతున్నారు. దీనిని క్లిక్ చేస్తే మన ఫోన్‌లో ఉన్న సమాచారం వెళ్లిపోయే ప్రమాదముంది. కాంటాక్ట్ నెంబర్లు, ఫొటోలు, వీడియోలపాటు డాక్యుమెంటు ఫైళ్ల సైతం వారికి చేరిపోయో ప్రమాదం ఉంది.

లింకులపై అప్రమత్తంగా ఉండాలి..

అపరిచిత వ్యక్తులు పంపించే ఏపీకే ఆండ్రాయిడ్ ప్యాకేజీ ఫైళ్ల, మెసెజ్‌లను క్లిక్ చేయవద్దని సాలూరు రూరల్ సీఐ రామక్రిష్ణ తెలిపారు. లింకులపై అప్రమత్తంగా ఉండాలని పేర్కొన్నారు. వ్యక్తిగత సమాచారం ఎట్టి పరిస్థితులో తెలియని వ్యక్తులకు ఇవ్వద్దని చెప్పారు. వీలైతే వ్యక్తిగతంగా కలుసుకోవాలని సూచించారు. సైబర్ నేరగాళ్లపై అప్రమత్తంగా ఉండాలని, నకిలీ యాప్‌లపై జాగ్రత్త వహించాలని కోరారు.



వైభవంగా ధనుర్మాస పూజలు

సాలూరు రూరల్, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): ధనుర్మాసం సందర్భంగా సాలూరులోని కల్యాణ వేంకటేశ్వరస్వామి, పెదకోమటిపేట రామాలయాల్లో మంగళవారం వైభవంగా పూజలు నిర్వహించారు. ఈ పూజల్లో పలువురు భక్తులు పాల్గొన్నారు.

పర్యాటక ప్రాంతాలను పరిరక్షించాలని..

- పాదయాత్ర చేసుకుంటూ దేవ్‌మాలిని అధిరోహించిన చిన్నారావు

సాలూరు రూరల్, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): పర్యాటక ప్రాంతాలను, పర్యావరణాన్ని పరిరక్షించాలని కోరుతూ ఒడిశా సామాజిక సేవకుడు షావుకారి చిన్నారావు తూర్పు కనుమల్లో ఎత్తయిన శిఖరమైన దేవ్‌మాలిని పాదయాత్ర చేసుకుంటూ అధిరోహించారు. అంతరాష్ట్ర ట్రెక్కింగ్, సైకిల్ యాత్రికుడు చిన్నారావు మంగళవారం కొఠియా గ్రూపు గ్రామాల నుంచి పాదయాత్ర చేస్తూ దేవ్‌మాలి గిరిశిఖరాన్ని అధిరోహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యాటక ప్రాంతాలకు విచ్చసిన పర్యాటకులు ప్లాస్టిక్, పాలిథిన్ కవర్ల విడిచిపెట్టడం వల్ల పర్యావరణానికి నష్టం వాటిల్లితుందని తెలిపారు. ప్రతిఒక్కరూ ప్రకృతి పరిరక్షణకు పాటు పడాలని కోరారు. ఈ సందేశంలో ఆయన మూడు గంటలకు పైగా నడిచి దేవ్‌మాలి శిఖరానికి చేరుకుని, భారత జాతీయ జెండాను పాతారు.



దేవ్‌మాలి శిఖరంపై జాతీయ జెండాను చిన్నారావు

SANTOOR
సంతూర్
ముత్యాల ముగ్గుల పోటీ
ఆంధ్రజ్యోతి ABN
అందమైన ముగ్గులు వేయండి.. ఆనందంగా బహుమతులు అందుకోండి. రాష్ట్ర స్థాయిలో విజేతలకు రూ.1,50,000/-లకు పైగా బహుమతులు.
పోటీలు జరుగు తేది, సమయం : జనవరి 4, 2025
శనివారం ఉదయం 10గం॥ల నుంచి
పోటీలు జరిగే ప్రదేశం:
ఎయిమ్స్ విద్యాసంస్థల మైదానం, తోటపాలెం,విజయనగరం.
పేర్ల నమోదు కొరకు సంప్రదించండి: ఫోన్ : 99854 95666
ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానం, పార్వతీపురం, పార్వతీపురం మన్యం జిల్లా.
పేర్ల నమోదు కొరకు సంప్రదించండి: ఫోన్ : 9985411530, 6301791560
నిబంధనలు:
- మహిళలు మాత్రమే పాల్గొనాలి
- చుక్కల ముగ్గులు మాత్రమే వేయాలి
- ఎన్ని చుక్కలు, ఎన్ని వరుసలు చెప్పగలిగి ఉండాలి
- ముగ్గు, రంగులు వగైరా పోటీదారులే తెచ్చుకోవాలి
- ముగ్గు వేయడానికి గరిష్ట సమయం రెండు గంటలు
మొదటి బహుమతి రూ.6,000/-
రెండో బహుమతి రూ.4,000/-
మూడో బహుమతి రూ.3,000/-
యవ్వనపు చర్మ రహస్యం
SANTOOR Skin Moisturising Sandal & Turmeric
AIM GROUP OF EDUCATIONAL INSTITUTIONS
తోటపాలెం,విజయనగరం
సెల్: 9885979777, 9177278800
చైర్మన్ : కడగల ఆనంద్‌కుమార్
శ్రీ వెంకటేశ్వర జ్యూయల్ ప్యాలస్
© 7032190616
Fashion Partner
DIGSEL WOMEN'S
సెల్సియా
ట్రెండీ మహిళల అంతర్గత దుస్తులు
selsia TRENDY WOMEN'S
BRA - PANTIES - SLIPS & LEGGINGS
SCAN & BUY
TRADE ENQUIRY : 93445 53675
Gardening Partner
ఎటువంటి పంటలకైనా క్రాఫ్ట్ వారి పెర్‌ఫెక్ట్
ఆకు కూరలు, కూరగాయలు, పళ్ల పంటలు, మిరప, పొగాకు, పసుపు వంటి వాణిజ్యపంటలు, వరి, రాగి మొదలైన పంటలు, మిద్దెతోటలు, పెరటి తోటలకైనా చీడపీడలబారిన పడకుండా, లేదా చీడపీడలతో ఆకు ముడలతో పంట పాడైనా రామబాణం లాంటిది 'పెర్‌ఫెక్ట్'. ఒక్క లీటరు నీటికి కేవలం 2ఎంఎల్ పెర్‌ఫెక్ట్‌ను కలిపి పిచికారి చేయడం ద్వారా చీడపీడలు, ఆకుముడత, మిరపలో నల్లతామర వంటి రోగాలను నివారించి, ప్రారదోలి మొక్కలు నూతన జవసత్వాలతో ఏపుగా పెరిగి, (7-15 రోజులకొకసారి పిచికారి చేయవలసి ఉంటుంది) కొత్తపూత పిందెలతో అధిక దిగుబడినిస్తుంది.
✔ వృక్ష ఆయుర్వేదం (100%) ఆర్గానిక్ ✔ సేంద్రీయ వ్యవసాయం
✔ రసాయనిక అవశేషాలు లేని పంటల ఉత్పత్తి
✔ 11 వనమూలికల ఔషధ సమ్మేళనం ✔ సమగ్ర సస్య సంరక్షణ
B.Sc. (Agri), B.Sc.(Horti), Agri Business Management, Any Degree చేసినవారికి ఏరియా/ జిల్లాల వారీగా ఉద్యోగావకాశాలు కలవు.
ఆకర్షణీయమైన ఆదాయం. ఆసక్తిగలవారు మెయిల్‌ద్వారాగానీ, ఫోన్‌ద్వారా గానీ సంప్రదించండి.
ఈమెయిల్ ID: globalgreenperfekt@gmail.com, వెబ్‌సైట్: www.perfektindia.in, కస్టమర్ కేర్ నంబర్లు: 94482 74211, 73377 74148

ఆక్రమణల తొలగింపునకు సర్వే

శృంగవరపుకోట, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): శృంగవరపుకోట పట్టణ పరిధిలోని విశాఖ-అరకు రోడ్డు ఆక్రమణల తొలగింపునకు మంగళవారం రెవెన్యూ, పంచాయతీరాజ్ అధికారులు సర్వే నిర్వహించారు. ఎంపీడీవో సతీష్, ఈవోపీఆర్డీ ఐ.వి.లక్ష్మి, సర్వేయర్ రమ.. రోడ్డుకు అనుకుని ఉన్న వాణిజ్య, వ్యాపార సముదాయాల వద్ద కొలతలు వేశారు. చాలామంది దుకాణదారులు రోడ్డును ఆక్రమించి నిర్మాణాలు చేపట్టినట్టు అధికారులు గుర్తించారు.

గోదాం పరిశీలన

మెరకముడిదాం, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): బైరిపురంలోని రాష్ట్ర గిడ్డంగుల సంస్థ పరిధిలోని గోదాంను మంగళవారం ఆ సంస్థ రీజనల్ మేనేజరు రాజేశ్వరి గోప్యంగా తనిఖీలు నిర్వహించినట్టు తెలిసింది. గోదాంలో రేషన్ బియ్యం అక్రమాలపై పత్రికల్లో కథనాలు రావడంతో అధికారులు తనిఖీలు చేశారు. అయితే గోప్యంగా తనిఖీలు చేయడం స్థానికంగా చర్చనీయాంశమైంది. తూతూ మంత్రంగా కొద్ది సమయం తనిఖీలు చేశారని తెలుస్తోంది.

డ్రాపౌట్స్ తగ్గించండి

శృంగవరపుకోట, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): పాఠశాలల్లో విద్యార్థుల డ్రాపౌట్స్‌ను తగ్గించాలని ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు ఉపాధ్యాయులకు సూచించారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీలు, ప్రధానోపాధ్యాయులకు నిర్వహిస్తున్న శిక్షణ శిబిరాన్ని ఆయన పరిశీలించారు. ఎంఈవోలు నర్సింగరావు, పాదం లక్ష్మి తదితరులు ఉన్నారు.

మడ్డువలసలో పెరిగిన నీటిమట్టం

వంగర, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): మడ్డువలస రిజర్వాయర్‌లో నీటి మట్టం పెరిగింది. ఒడిశాలో కురిసిన వర్షాలకు నాలుగురోజులుగా రిజర్వాయర్‌కు వేగావతి, సువర్ణముఖి నదుల్లోకి నీరుచేరుతోంది. దీంతో మంగళవారం ఉదయం వరకు 64.50 మీటర్లు ఉన్న రిజర్వాయర్ నీటిమట్టం ఒక్కసారిగా పెరిగి 64.64 మీటర్లకు పెరిగింది. ప్రమాదస్థాయికి చేరడంతో అప్రమత్తమైన అధికారులు రెండు ప్రధాన గేట్లు ఎత్తి నాగావళిలోకి నీరు విడుదల చేశారు. ఈ రెండు నదుల నుంచి 440 క్యూసెక్కులు నీరు వచ్చి చేరుతుండడంతో వచ్చిన నీటిని యదావిధిగా దిగువకు విడిచిపెట్టినట్లు మడ్డువలస రిజర్వాయర్ ఏఈ నితిన్ తెలిపారు.

బాధ్యతల నుంచి తొలగింపు

వేపాడ, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బానాది పంచాయతీ ఇన్‌చార్జి కార్యదర్శి ఎస్.ఎస్.ఎన్.మూర్తిని ఆ బాధ్యతల నుంచి జిల్లా పంచాయతీ అధికారి టి.వెంకటేశ్వరరావు తప్పిస్తూ మంగళవారం ఆదేశాలు జారీ చేశారు. పంచాయతీ కార్యదర్శి మూర్తి ఆగడాలపై సర్పంచ్ కర్రి యశోదతో పాటు కొంతమంది వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు అక్టోబరు 7న కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన నేపథ్యంలో విజయనగరం డీఎల్‌పీవోను విచారణకు ఆదేశించారు. ఆయన ఇచ్చిన నివేదిక ఆధారంగా మూర్తిని ఆ పంచాయతీ బాధ్యతల నుంచి డీపీవో తప్పించారు.

బీజేపీ మండల అధ్యక్షుడిగా రామకృష్ణ

డెంకాడ, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): డెంకాడ గ్రామానికి చెందిన కోరాడ రామకృష్ణ బీజేపీ మండల పార్టీ అధ్యక్షునిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈమేరకు మంగళవారం మండల కేంద్రంలో నిర్వహించిన మండల సంస్థాగత ఎన్నిక నిర్వహించారు. ఆ పార్టీ నాయకులు పైడి వేణుగోపాలం, డి.నాగార్జున, నెల్లిమర్ల నియోజకవర్గం ఇన్‌చార్జి బూర్లె శ్రీధర్ ఉన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

కొత్తవలస, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చింతలపాలెంలో రూ.45 లక్షల విలువైన అభివృద్ధి పనులకు మంగళవారం ఎమ్మెల్యే లలిత కుమారి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధి ఒకేసారి చేపడుతోందన్నారు. కార్యక్రమంలో చింతలపాలెం సర్పంచ్ మాకెన నవీన్, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

మెరుగైన వైద్యం అందించాలి

విజయనగరం క్రైం, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని గంట్యాడ మండలంలోని గ్రీన్‌ఫీల్డ్ హైవే సమీపంలో గతనెల 30వ తేదీ రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఏఆర్ కానిస్టేబుల్ పి.శ్రీనివాసరావుకు మెరుగైన వైద్యం అందించాలని ఎస్పీ వకుల్ జిందాల్ సూచించారు. ఈమేరకు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న శ్రీనివాసరావును ఆయన పరామర్శించారు. ఆయన వెంట ఏఆర్ ఎస్పీ నాగేశ్వరరావు, ఆర్ఐలు గోపాలనాయుడు, శ్రీనివాసరావు, రూరల్ సీఐ లక్ష్మణరావు ఉన్నారు.

బాధితురాలికి ఆర్థిక సాయం

రాజాం, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): సంతకవిటి మండలంలోని సిరిపురంలో గల ఈశ్వరి కుటుంబానికి రాజాం ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ రూ. 2 లక్షలు అందజేశారు. సిరిపురంలో ఇటీవల జరిగిన అగ్నిప్రమాదంలో మంచిరెడ్డి ఈశ్వరి వివాహనికి దాచుకున్న సొమ్ము, బంగారం, దుస్తులు కాలిపోవడంతో మంగళవారం రాజాం టీడీపీ పార్టీ కార్యాలయంలో ఆమెకు ఆర్థికసాయం చేశారు. కార్యక్రమంలో గణేష్, మొయ్యి నారాయణప్పడు పాల్గొన్నారు.

సమయం ఇవ్వండి

విజయనగరం దాసన్నపేట, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని గ్రామ, వార్డు, డివిజన్ సచివాలయాల్లో కులగణన జనాభా లెక్కల్లో తప్పులు సరిచేసుకోవడానికి సమయం ఇవ్వాలని ఎంఆర్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు బోగి శ్రీనుమాదిగ కోరారు. మంగళవారం కలెక్టర్ డాక్టరు బీఆర్ అంబేడ్కర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో యూనియన్ ప్రతినిధులు నాగేశ్వరరావు, చంటి, సురేష్, అప్పారావు మాదిగ పాల్గొన్నారు.

పోలీసులకు సత్కారం

విజయనగరం క్రైం, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): పోలీసుశాఖలో విధులు నిర్వహించి ఉద్యోగవిరమణ, స్వచ్ఛంద విరమణ చేసిన డీటీసీ ఎస్ఐ త్రినాథరావు, ఆర్ఎస్ఐ బి.సన్యాసిరాజు, హెచ్‌సీ ఎం.గణేష్, హోంగార్డు కె.రామారావును మంగళవారం ఎస్పీ వకుల్ జిందాల్ సత్కరించారు. కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ యూనివర్స్ తదితరులున్నారు.

పథకాల అమలుకు 'కూటమి' ఉత్సాహం



భోగాపురం: పింఛన్లు పంపిణీ చేస్తున్న ఎంపీ కలిశెట్టి, ఎమ్మెల్యే నాగమాధవి..



కొత్తవలస: దయాలసిస్ రోగికి పింఛను అందిస్తున్న ఎమ్మెల్యే లలితకుమారి

భోగాపురం, డిసెంబరు31(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం సంక్షేమ పథకాలు అమలు చేయడంలో ఉత్సాహం చూపుతోందని ఎంపీ కలిశెట్టి అప్పల నాయుడు అన్నారు. లింగాలవలసలో మంగళవారం నిర్వహించిన సామాజిక పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ఆయనతో పాటు ఎమ్మెల్యే లోకం నాగమాధవి, రాష్ట్ర మార్క్‌ఫెడ్ చైర్మన్ కర్రోతు బంగార్రాజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీ కలిశెట్టి మాట్లాడుతూ ముందస్తుగా పింఛన్లు పంపిణీ చేయడంతో లబ్ధిదారుల కళ్లల్లో ఆనందం వెల్లివిరుస్తోందన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు కర్రోతు సత్యనారాయణ, జనసేన మండల అధ్యక్షులు వందనాల రమణ, పల్లట్ల జగదీష్, సర్పంచ్ బి.లలిత తదితరులు పాల్గొన్నారు.

లక్కవరపుకోట/కొత్తవలస: ఎల్.కోట, కొత్తవలస మండలాల్లో మంగళవారం నిర్వహించిన సామాజిక పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి పాల్గొన్నారు. దివ్యాంగులతో పాటు చింతలపాలెంలో డయాలసిస్ రోగి గొలగాని పోలి రాజుకు రూ.10 వేలు పింఛన్ ఆఆమె అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఒక్కరోజు ముందుగానే పింఛన్లు లబ్ధిదారులకు అందించడం ఆనందంగా ఉందన్నారు.

గుర్ల: రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమం ముఖ్యమంత్రి చంద్రబాబుకు రెండు కళ్లని ఎమ్మెల్యే కిమిడి కళా వెంకటరావు అన్నారు. మండలంలోని పెనుబర్తిలో నిర్వహించిన పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చిన ఆరు మాసాల్లో ఒకవైపు అభివృద్ధి చూసుకుంటూ మరోవైపు సంక్షేమం ఆగకుండా నడిపిస్తున్న మహానాయకుడు చంద్రబాబు అని కొనియాడారు. కార్యక్రమంలో బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి సన్యాసినాయుడు, కిరణ్ కుమార్‌రాజు, కడగల ఆనందరావు, మండల అప్పల నాయుడు, సన్యాసినాయుడు, దాసరి శివప్రసాద్, నాగులపల్లి నారాయణరావు, సూర్యారావు పాల్గొన్నారు.

రాజాం: ప్రభుత్వం అందజేస్తున్న సామాజిక పింఛన్ల మొత్తం పెంచిన ఘనత చంద్రబాబుదేనని ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ తెలిపారు. మంగళవారం రాజాంలోని బొబ్బిలి రోడ్డు జంక్షన్‌లోని మాదిగ వీధిలో ఎన్టీఆర్ భరోసా పింఛన్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు గురవాన నారాయణరావు, వంగా వెంకటరావు, నంది సూర్యప్రకాష్‌రావు, నల్ల శ్రీను, పొట్నూరు లక్ష్మణరావు, నాగళ్ల అప్పలనాయుడు, గణేష్, అంపోలు శ్రీను, నాగరాజు పాల్గొన్నారు.



గుర్ల: పింఛన్ అందజేస్తున్న ఎమ్మెల్యే కిమిడి



రాజాం:పింఛన్ అందజేస్తున్న ఎమ్మెల్యే కోండ్రు

రెండోరోజు 320 మందికి పరీక్షలు

విజయనగరం క్రైం, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): జిల్లా పోలీసు పరేడ్ గ్రౌండ్‌లో స్టైఫెండరీ పోలీసు కానిస్టేబుల్స్ ఉద్యోగ నియామకాలకు మంగళవారం రెండో రోజు 600 మంది అభ్యర్థులు హాజరు కావాల్సి ఉండగా, 320 మంది మాత్రమే హాజరయ్యారు. వేకువ జామున 5 గంటల నుంచే టీఎంటీ, పీఈటీ పరీక్షల ప్రక్రియ ప్రారంభమై 2 గంటలకు ప్రక్రియ పూర్తయ్యింది. ఎస్పీ వకుల్ జిందాల్ స్వయంగా పర్యవేక్షించారు. ఏఎస్పీలు సౌమ్యలత, జి.నాగేశ్వరరావు, డీఎస్పీలు యూనివర్స్, వీరకుమార్, బాపూజీ, టి.ఎం.శ్రీనివాసరావు, థామస్‌రెడ్డి, ఏవో శ్రీనివాసరావు, పలువురు సీఐలు, ఆర్ఐలు, ఎస్ఐలు, ఆర్ఎస్ఐలు పాల్గొన్నారు,

గ్రామాల్లో సమస్యలు పరిష్కరించండి

గరివిడి, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని సభ్యులు కోరారు. స్థానిక మండ పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ మీసాల విజయలక్ష్మి అధ్యక్షతన మంగళవారం మండల సర్వసభ్య సమావేశం జరిగింది. కోనూరు, కొండపాలెం తదితర గ్రామాల్లో పలువురికి పట్టాలు ఇచ్చి వాటిని రద్దు చేయడంపై బూడి శ్రీరాములు, లెంక శ్రీరాములు, ఎడ్ల అప్పారావు ధ్వజమెత్తారు. అలాగే కాపుసంబంలో 48 ఇళ్లకు సంబంధించి పట్టాల రిజిస్ట్రేషన్ పేరుతో సొమ్ము వీఆర్వో ఉంచుకున్నారని ఆరోపించారు. రూ.కోటి వ్యయంతో నిర్మించిన సచివాలయం, రైతు భరోసా కేంద్రాలు ఇంతవరకు ప్రారంభించకపోవడం ఏమిటని నిలదీశారు. చీపురుపల్లి ప్రభుత్వ ఆసుపత్రి వైద్యుల పనితీరు సరిగా లేదని జడ్పీటీసీ సభ్యుడు వాకాడ శ్రీను సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. వెదులవలస ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనం నాసిరకంగా ఉంటోందని వైస్ ఎంపీపీ గుడివాడ వెంకట శ్రీరాములు, సర్పంచ్ తమ్మినాయుడు తెలిపారు. సమావేశంలో ఎంపీడీవో సుబ్రహ్మణ్యం, హెచ్‌డీటీ దమరసింగి సురేష్ పాల్గొన్నారు.

జీవితకాల సభ్యత్వం అందజేత

చీపురుపల్లి, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): ఇది మంచి ప్రభుత్వమన్న విశ్వాసం ప్రజల్లో కలిగిందని, రాష్ట్రంలోని ప్రజలంతా గత ఆరు నెలలుగా చాలా సంతోషంగా ఉన్నారని ఎమ్మెల్యే కిమిడి కళావెంకటరావు అన్నారు. చీపురుపల్లి నియోజవర్గంలో పలు కార్యక్రమాల్లో పాల్గొన్న అనంతరం ఆయన చీపురుపల్లి పార్టీ కార్యాలయంలో మాజీ ఇన్‌చార్జి కుచ్చర్లపాటి త్రిమూర్తుల రాజుకు రూ.లక్ష జీవిత కాల సభ్యత్వాన్ని ఆయన అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర పార్టీ కార్యదర్శి కిమిడి రామ్‌మల్లిక్‌నాయుడు, కుచ్చర్లపాటి త్రిమూర్తులరాజు, డి.రామచంద్రుడు, పైల బలరాం, సారేపాక సురేష్, వెన్నె సన్యాసినాయుడు, టి. కిరణ్, చనుమోలు రమణ, రెడ్డి గోవింద్, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి విసినిగిరి శ్రీనివాసరావు, కోట్ల కృష్ణ పాల్గొన్నారు.

వింత తెగులుతో ఎండిపోతున్న చింతచెట్లు

లక్కవరపుకోట, డిసెంబరు31 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రంగారాయపురంలో చింతచెట్లకు వింత తెగులు సోకింది. దీంతో వారం రోజుల వ్యవధిలో 25 చింతచెట్లు ఎండిపోయాయి. గ్రామానికి చెందిన సర్వయ్య కల్లంలో పదుల సంఖ్యలో చింతచెట్లు ఉన్నాయి. కొద్దిరోజులుగా చింతచెట్లన్నీ చనిపోతున్నాయని రైతు కాశీవిశ్వనాథం తెలిపారు. ఈ విషయం వ్యవసాయ అధికారులకు తెలియజేస్తే అది హార్టికల్చర్ పరిధిలోకి వస్తుందని చెప్పి తప్పించుకుంటున్నారని రైతులు అంటున్నారు. ఫలసాయాన్నిచ్చే చెట్లు ఎండిపోతుండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.



ఎండిపోయిన చింతచెట్లు

విశాఖ రేంజ్‌లో ఏడుగురు సీఐలకు డీఎస్పీలుగా పదోన్నతి?

విశాఖపట్నం, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి):డీఎస్పీలుగా పదోన్నతికి అరులైన సీఐల జాబితాను అధికారులు మంగళవారం రాష్ట్ర పోలీస్ డైరెక్టర్ జనరల్ ద్వారకా తిరుమలరావుకు పంపించారు. ఆయన ఆమోదించి త్వరలో ఉత్తర్వులు జారీచేసే అవకాశం ఉంది. అధికారులు తయారుచేసిన సీనియారిటీ జాబితాలో విశాఖ రేంజ్ పరిధిలో సీఐలుగా పనిచేస్తున్న 1995 బ్యాచ్‌కు చెందిన పీవీవీ నరసింహరావు, వి.బాబ్జీరావు, ఎస్.ఆదం, ఆర్.నీలయ్య, జి.వెంకట రమణ, వి.చంద్రశేఖర్. టి.సీతారాం, ఎం.బుచ్చిరాజు, ఎస్.కాంతారావు పేర్లు ఉన్నాయి. వీరికి అడ్‌హాక్ పదోన్నతి లభించనుంది. వీరంతా 2009లో సీఐలుగా పదోన్నతి పొందారు. డీఎస్పీ పదోన్నతి కోసం వారు ఎదురుచూస్తున్నారు.

సూరిబాబుకు సీఎం సహాయనిధి



చెక్కు అందజేస్తున్న మంత్రి శ్రీనివాస్, అశోక్ గజపతిరాజు తదితరులు

నెల్లిమర్ల, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రామతీర్థం గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త చందక సూరిబాబుకు ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి రూ. 5 లక్షలు మంజూరయ్యాయి. సంబంధిత చెక్కును మంగళవారం విజయనగరంలోని అశోక్ బంగ్లాలో రాష్ట్ర మంత్రి కొండపల్లి శ్రీనివాస్ ఆయనకు అందజేశారు. గతంలో రామతీర్థం బోడి కొండపై వెలిసిన కోదండరాముడి ఆలయంలో శ్రీరాముడి విగ్రహం తల నరికివేత ఘటనలో చందక సూరిబాబుపై పోలీసులు కేసు నమోదు చేశారు. విచారణ కోసం పలు సార్లు పిలిపించారు. అక్రమ కేసు బనాయించి సూరిబాబును చిత్రహింసలకు గురిచేశారని అప్పట్లోనే టీడీపీ నాయకులు ఆరోపించారు. పోలీసులు పెట్టిన హింసకు సూరిబాబు అనారోగ్యానికి గుర య్యారని నియోజకవర్గ ఇన్‌చార్జి కర్రోతు బంగార్రాజు ద్వారా సువ్వాడ రవిశేఖర్, కడగల ఆనంద్‌కుమార్ ఆ విషయాన్ని సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లారు. దాంతో సీఎం సహాయనిధి నుంచి రూ.5 లక్షలు మంజూరయ్యాయి. కార్యక్రమంలో కేంద్ర మాజీ మంత్రి పి.అశోక్ గజపతిరాజు, పా ర్టీ జిల్లా అధ్యక్షుడు కిమిడి నాగార్జున, ఏపీ మార్క్‌ఫెడ్ చైర్మన్ కర్రోతు బంగార్రాజు, ఎమ్మెల్యేలు అదితి గజపతిరాజు, కోళ్ల లలితకుమారి, బేబీనాయన, రామతీర్థం టీడీపీ నాయకులు కోటపాటి తిరుపతిరావు, కోటపాటి పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

కారు ఢీకొని ఉపాధ్యాయిని మృతి

భోగాపురం, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): భోగాపురం సచివాలయం-2 సమీపంలో జాతీయ రహదారిపై మంగళవారం కారు ఢీకొనడంతో వృత్తి విద్యాకోర్సు ఉపాధ్యాయిని నిష్టాల కమలారాణి (50) మృతి చెందింది. స్థానిక కస్తూర్బా బాలికల విద్యాలయంలో ఆమె అవుట్ సోర్సింగ్ ప్రాతిపదికన విధులు నిర్వర్తిస్తోంది. విజయనగరానికి చెందిన కమలారాణి రోజూ విజయనగరం నుంచి భోగాపురం రాకపోకలు సాగిస్తుంటారు. మంగళ వారం ఉదయం ఆమె విధులు ముగించుకుని ఇంటికి వెళ్లేందుకు సచివా లయం సమీపంలో జాతీయరహదారి దాటుతుండగా శ్రీకాకుళం నుంచి విశా ఖ వైపు వెళ్తున్న కారు ఢీ కొంది. దాంతో ఆమె తీవ్రగాయాల పాలైంది. తగ రపువలసలో ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్సపొందుతూ మృతి చెందింది. ఈ ఘటనపై ఎస్ఐ పి.సూర్యకుమారి కేసు నమోదు చేశారు.

అనుమానాస్పదంగా కానిస్టేబుల్ మృతి

జియ్యమ్మవలస, డిసెంబరు31 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పరజపాడు పంచాయతీ లక్ష్మీ పురం గ్రామానికి చెందిన సీఆర్‌పీఎఫ్ కాని స్టేబుల్ బొబ్బిలి అనంతనాయుడు(28) నల్గొండలో సోమవారం రాత్రి మృతి చెందారు. ఈయన కొంతకాలంగా మానసికంగా కొంత ఆందోళనలో ఉన్నట్లు గ్రామస్థులు తెలిపారు. అయితే ఇతను రైల్వే ట్రాక్‌పై విగతజీవిగా పడి ఉన్న ఫొటోలు ఇప్పుడు కుటుంబ సభ్యులకు తీవ్రంగా కలచి వేస్తున్నాయి. ఇది హత్యా.. ఆత్మహత్యా.. మరేదైనా కారణాలు ఉన్నాయా అని అనుమానిస్తున్నారు. ఈయనకు తల్లిదండ్రులు సూరినాయుడు, గౌరమ్మ ఉన్నారు. ఆయన మృతిపై నల్గొండలో పోలీసు ఉన్నతాధికారులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతిపై వివరాలు తెలియాల్సి ఉంది.

క్షతగ్రాతుడికి సీఐ సపర్యలు

రాజాం రూరల్, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): మితిమీరిన వేగంతో ఎదురుగా వస్తున్న లారీని స్కూటీతో రాంగ్ రూట్‌లో సోమవారం ఓ వ్యక్తి ఢీకొన్నాడు. రోడ్డు పక్కనే ఉన్న తుప్పల సమీపంలో పడిపోయాడు. ఆ వ్యక్తి మృతి చెందినట్లు అంతా భావించారు. ప్రమాదానికి గురైన వ్యక్తి రాజాం మండలం రామానుజులపేటకు చెందిన దువ్వూరు జగదీశ్వరావుగా నిర్ధారించారు. ప్రమాద విషయాన్ని కుటుంబ సభ్యులకు చేరవేసే ప్రయత్నా లు ప్రారంభించారు. పోలీసులు ఘటనాస్థలానికి చేరుకున్నారు. ఆ తర్వాత రాజాం టౌన్ సీఐ అశోక్‌కుమార్ ప్రమాదస్థలానికి చేరకుని ప్రమాదానికి గురైన వ్యక్తిని నిశితంగా పరిశీలించారు. ప్రమాదానికి గురైన వ్యక్తికి ఫిట్స్ ఉందని తెలుసుకున్న సీఐ సపర్యలు చేశారు. పది నిమిషాల తర్వాత అతడిలో కదలిక రావడంతో పోలీస్ వాహనంలో ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన చికిత్స కోసం సోమవారం రాత్రి పదిన్నర గంటల సమయంలో శ్రీకాకుళం తరలించారు. ప్రస్తుతం జగదీశ్వర్రావు ఆరోగ్య పరిస్థితి మెరుగ్గా ఉంది.

విజ్జీ క్రీడా మైదానం పరిశీలన

విజయనగరం టౌన్, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): నగరశివారు బాబామెట్టలోని విజ్జీ క్రీడా ప్రాంగణాన్ని విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, ఎమ్మెల్యే పూసపాటి అదితి గజపతిరాజు మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మైదానంలో నిర్వహిస్తున్న విజయ్ హజారే దేశవాళీ వన్డే టోర్నీలో జమ్ము కాశ్మీర్, మిజోరం జట్ల మధ్య జరుగుతున్న మ్యాచ్‌ను తిలకించారు. అనంతరం నిర్మాణంలో ఉన్న బాక్సింగ్ హాల్, క్రీడా పాఠశాల భవనాలు, టెన్నిస్ కోర్టు, వాకింగ్ ట్రాక్‌లను పరిశీలించారు. వారితో పాటు క్రికెట్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి పి.సీతారామరాజు ఉన్నారు.

శ్మశానవాటికలకు స్థలం కేటాయించండి

భోగాపురం, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): శ్మశానవాటికలకు స్థలం కేటాయించాలని రెడ్డికంచేరు గ్రామస్తులు తహశీల్దార్ సురేష్‌ను కోరారు. మంగళవారం రెడ్డికంచేరులో నిర్వహించిన రెవెన్యూ సదస్సుకు హాజరైన తహశీల్దార్‌ను కలిసి సమస్యను వివరించారు. ఈసందర్భంగా స్థానికులు మాట్లాడుతూ గ్రామానికి సంబంధించి రెండు శ్మశానవాటికలు ఉండేవన్నారు. అవి ప్రస్తుతం ఎయిర్‌పోర్టుకు సంబంధించిన స్థలంలో ఉండటంతో వారు ప్రహరీ నిర్మించారన్నారు. ప్రస్తుతం ప్రహరీని దాటి శ్మశానవాటికను ఉపయోగించుకుంటున్నామని వివరించారు.

చార్జీలు పెంచి ధర్నాలు చేస్తారా?



శిలాఫలకం ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే సంధ్యారాణి

పాచిపెంట, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): దొంగే దొంగ అన్న చందంగా విద్యుత్ చార్జీలు పది పర్యాయాలు పెంచి మళ్లీ వైసీపీ నాయకులే ధర్నాలు చేయడం విడ్డూరంగా ఉందని రాష్ట్ర స్త్రీ శిశు సంక్షేమ, గిరిజన సంక్షేమశాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి ఎద్దేవా చేశారు. పారమ్మ కొండ బీటీ రోడ్డును ఆమె మంగళవారం ప్రారంభించారు. ఇందుకుగానూ రూ.1.60 కోట్లు వెచ్చించి జాతీయ రహదారి నుంచి పారమ్మ కొండ వరకు రోడ్డు నిర్మించామన్నారు. మండల అధ్యక్షుడు పిన్నింటి ప్రసాద్‌బాబు ఉన్నారు.

గురుకులం ప్రిన్సిపాల్‌గా డాక్టర్ కె.బి.బి.రావు

నెల్లిమర్ల, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): నెల్లిమర్లలోని బీసీ బాలికల గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్‌గా డాక్టర్ కె.బి.బి.రావు మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన గతంలో ఇదే పాఠశాలలో ప్రిన్సిపాల్‌గా పనిచేసి అమరావతిలోని కార్యాలయానికి బదిలీ అయ్యారు. తిరిగి మళ్లీ ప్రిన్సిపాల్‌గా ఇక్కడే విధుల్లో చేరారు.

ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజనం

● జీవో జారీచేసిన కూటమి ప్రభుత్వం

రాజాం, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ప్రభుత్వ కళాశాలల్లో ఇంటర్ చదువుతున్న విద్యార్థులకు మధ్యాహ్న భోజనం పథకం అమలుచేయనున్నారు. ఉమ్మడి జిల్లాలోని 32 ప్రభుత్వ జూనియర్ కళాశాలలు ఉండగా, విజయనగరంలో 18, పార్వతీపురం మన్యంలో 14 కళాశాలలు నిర్వహిస్తున్నారు. 2014లో అధికారంలోకి వచ్చిన టీడీపీ ప్రభుత్వం జూనియర్ కాలేజీల్లో మధ్యాహ్న భోజన పథకం ప్రారంభించిన విషయం విదితమే. వైసీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే 2019లో ఆ పథకాన్ని నిలి పివేసింది. దీంతో ఇంటర్ విద్యార్థులు మధ్యాహ్నం ఆకలితో అలమటించేవారు. తాజాగా కూటమి ప్రభుత్వం మళ్లీ జూనియర్ కాలే జీల్లో మధ్యాహ్న భోజనాన్ని ప్రారంభించేం దుకు ముందుకొచ్చింది.ఈ మేరకు పాఠశాల విద్యాశాఖ కార్యదర్శి కోన శశిధర్ ప్రత్యేక జీవో జారీచేశారు. ఈ పథకం అమలుకోసం రాష్ట్రవ్యాప్తంగా ఈ విద్యా సంవత్సరానికి రూ. 29.39 కోట్లు, వచ్చే విద్యాసంవత్సరానికి సైతం రూ.85.84 కోట్లు కేటాయించడం విశే షం. ఈ పథకం వైసీపీ ప్రభుత్వం నిలిపివే యడంతో ఉమ్మడి జిల్లాలో ఇంటర్‌లో ఉత్తీర్ణత శాతం పడిపోయింది.

3 నుంచి ప్రారంభం

విజయనగరం కలెక్టరేట్, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ఈనెల మూడో తేదీ నుంచి మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రారంభిస్తున్నట్లు కలెక్టర్ బీఆర్ అంబేడ్కర్ చెప్పారు. మంగళవారం విజయనగరంలోని తన చాంబర్‌లో మధ్యాహ్న భోజన పథకం అమలుపై డీఈవో మాణిక్యంనాయుడు, ఆర్ఐవో ఎం. ఆదినారాయణతో సమీక్షించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని మొదటి సంవత్సరం 2,650 మంది, ద్వితీయ సంవత్సరం 2010 మంది చదువుతున్నారని తెలిపారు. తొమ్మి ది కళాశాలల్లో అక్షయపాత్ర ఫౌండేషన్, మిగిలిన తొమ్మిది కళాశాలల్లో ఆయా కళాశాలకు సమీపంలోని ప్రభుత్వ పాఠశాలల్లో పథకం నిర్వహిస్తున్న హెచ్‌హెచ్‌సీ గ్రూపుల ద్వారా అమలు చేయనున్నట్లు చెప్పారు.

అభివృద్ధి, సంక్షేమం కూటమి ధ్యేయం

గరివిడి, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం సంక్షేమంతో పాటు అభివృద్ధి పనులకు ప్రాధాన్యమిస్తోందని టీడీపీ రాష్ట్ర కార్యద ర్శి కిమిడి రామ్‌మల్లిక్‌నాయుడు అన్నారు. పట్టణంలో ఫేకర్ కార్మికులకు నూతనంగా మంజూరు చేసిన విద్యుత్ మోటార్లను మంగళవారం ఆయన ప్రారంభించారు. అనంతరం గరివిడి, గెడ్డపువలస, తాటిగూడ గ్రామాల్లో పింఛన్ల పంపిణీలో పాల్గొన్నారు. కార్యక్రమంలో నాయకులు పైల బలరాం, ఎస్.సురేష్‌కుమార్, గోవింద్, వెంపడాపు రమణమూర్తి, తూట శ్రీను, బొడ్డేపల్లి ప్రసన్నకుమార్ పాల్గొన్నారు.

చెలరేగిన అబ్దుల్ సమద్

● 64 బంతుల్లో 112 పరుగులు చేసి భారీ స్కోర్‌కు దోహదం

● మిజోరంపై జమ్ము కాశ్మీర్ విజయం





స్టంప్ అవుట్ చేసే ప్రయత్నం చేస్తున్న కీపర్, బౌండరీ లైన్ వద్ద క్యాచ్ పట్టుకున్న మిజోరాం ఫీల్డర్

విజయనగరం టౌన్, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): విజయ్ హజారే వన్డే టోర్నీలో జమ్ము కాశ్మీర్ జట్టు మిజోరం జట్టుపై 168 పరుగుల తేడాతో గెలుపొందింది. జమ్ము కాశ్మీర్ బ్యాట్స్ మెన్ అబ్దుల్ సమద్ చెలరేగిపోయాడు. 64 బంతుల్లో 112 పరుగులు చేసి జట్టు భారీ స్కోర్‌కు దోహదపడ్డాడు. మంగళవారం డెంకాడ మండలంలోని చింతలవలసలోని డాక్టర్ పీవీజీ రాజు ఏసీఏ స్పోర్ట్స్ కాంప్లెక్స్ మైదానంతోపాటు, విజయనగరం శివారులోని విజ్జీ క్రికెట్ మైదానంలో బీసీసీఐ ఆధ్వర్యంలో విజయ్ హజారే వన్డే ట్రోఫీ నిర్వహిస్తున్నారు. ఈ మేరకు వి జ్జీ క్రికెట్ మైదానంలో జమ్ము కాశ్మీర్, మిజోరం జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో మిజోరం జట్టు టాస్ గెలిచి ఫీల్డింగ్ ఎంచుకుంది. బ్యాటింగ్ ప్రారంభించిన జమ్ముకాశ్మీర్ జట్టు నిర్ణీత 50 ఓవర్లలో ఆరు వికెట్ల నష్టానికి 377 పరుగుల సాధించింది. ఓపెనర్లు విబ్రాంత్ శర్మ 57 పరు గులు, శుభం కజూరియా 45 బంతుల్లో 60 పరుగులు చేశారు. వీరిద్దరూ 97 పరుగుల భాగ స్వామ్యంతో జట్టుకు శుభారంభాన్ని అందించా రు. ఆ తర్వాత బ్యాటింగ్‌కు వచ్చిన అజాజ్ డ కౌట్ అయ్యాడు. ఈ దశలో బ్యాటింగ్‌కు వచ్చిన కెప్టెన్ పీకేదోగ్రా, విబ్రాంత్ శర్మతో కలిసి అర్థ సెంచరీ భాగస్వామ్యాన్ని నెలకొల్పారు. 147 పరుగుల వద్ద మూడో వికెట్ కోల్పోయింది. ఆ సమయంలో మిడిల్ ఆర్డర్‌లో వచ్చిన ఐపీఎల్ ఆటగాడు అబ్దుల్ సమద్ మిజోరం బౌలర్లపై చెలరేగిపోయాడు. కెప్టెన్ దోగ్రా 39 పరుగులు చేసి అవుట య్యాడు. సమద్‌కు జతకలిసిన ఎల్ ఎస్ ముజాఫర్ 82 బంతుల్లోనే 152 పరుగులు చేశారు. అబ్దుల్ సమద్ 64 బంతుల్లోనే 112 పరుగులు సాధించగా, ముజాఫర్ 45 బంతుల్లో 72 పరుగులు చేసి అవుటయ్యారు. అనంతరం 378 పరుగుల విజయలక్ష్యంతో బ్యాటింగ్ చేపట్టిన మిజోరం జట్టు తొలి బంతికే వికెట్ కోల్పోయి కష్టాల్లో పడిం ది. ప్రారంభం నుంచే వికెట్లు పడిపోవడంతో పాటు రన్‌రేటు ఆశించనంత సాధించలేదు. మొత్తం మీద 42.2 ఓవర్లలో 209 పరుగులకు ఆలౌటైంది. ఆ జట్టులో అగ్ని చోప్రా ఒక్కడే 75 పరుగులు చేశా డు. జమ్ము కాశ్మీర్ బౌలర్లలో అబిద్ ముస్తాఖ్ ఐదు వికెట్లు పడగొట్టాడు. దీంతో అబిద్ ముస్తాఖ్‌కు మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్ అవార్డు లభించింది. ఈ విజయంతో జమ్ము కాశ్మీర్ జట్టుకు నాలుగు పాయింట్లు లభించాయి.

ఆరు వికెట్ల తేడాతో విదర్భ గెలుపు

తమిళనాడు, విదర్భ జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో విదర్భ జట్టు ఆరు వికెట్ల తేడాతో తమిళనాడుపై విజయం సాధించింది. విదర్భ జట్టు టాస్ గెలిచి తమిళనాడు జట్టుకు బ్యాటిం గ్ అప్పగించింది. దీంతో బ్యాటింగ్ ప్రారంభిం చిన తమిళనాడు జట్టు 48.4 ఓవర్లలో 256 పరుగులకు ఆలౌటైంది. ఓపెనర్ తుషార్ రహేజా 74 బంతుల్లో 4 ఫోర్లు 6 సిక్సర్లతో 75 పరుగులు చేశాడు.మిడిల్ ఆర్డర్‌లో వచ్చిన ఎ.సిద్ధార్థ్ 40 పరుగులు, ఎస్.మహమద్ అలి 48 పరుగులతో రాణించారు. విదర్భ జట్టు బౌలర్ డీజీ నల్కందే 9.4 ఓవర్లలో 55 పరుగులు ఇచ్చి ఆరు వికెట్లు పడగొట్టాడు. అనంతరం 257 పరుగుల లక్ష్యంతో విదర్భ బ్యాటింగ్ ప్రారంభించింది. ఆ జట్టు కెప్టెన్ కరుణ్ నాయర్ 103 బంతుల్లో 111 పరుగులు చేశాడు. దీంతో 43.5 ఓవర్లలోనే కేవలం నాలుగు వికెట్లు మాత్రమే కోల్పోయి విజయం సాధించింది. ఆ జట్టు బ్యాట్స్‌మెన్లు ధ్రువ్ షోరే, యష్ ఖాదమ్ 31 పరుగులు చొప్పున, ఎస్‌బి దూబే 39 పరుగులుచేసి జట్టు విజయానికి కృషి చేశారు. ఆరు వికెట్లు పడగొట్టిన విదర్భ జట్టు బౌలర్ డీజీ నల్కందేకు మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్ అవార్డు లభించింది.

నేటి నుంచి కళాశాలల్లో ఎండీఎం

గుమ్మలక్ష్మీపురం, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో జనవరి 1వ తేదీ నుంచి మధ్యాహ్న భోజన పథకం అమలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ నేపథ్యంలో గుమ్మలక్ష్మీపురం ఎస్టీ జూనియర్ కళాశాలలో ఎండీఎం అమలుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

నూతన సంవత్సర శుభాకాంక్షలు
2025
విద్యార్థులకు వారి తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు, ప్రజాప్రతినిధులకు, మిత్రులకు నూతన సంవత్సర శుభాకాంక్షలు
డా॥బి.ఆర్.అంబేద్కర్ గురుకులం (బాలికలు)
గరుగుబిల్లి-పార్వతీపురం మన్యం జిల్లా
ఎస్.సంధ్యారాణి ప్రిన్సిపాల్
పి.వెంకటరత్నం వైస్ ప్రిన్సిపాల్
మరియు సిబ్బంది

కలిసికట్టుగా అభివృద్ధికి కృషి చేద్దాం

- పాలకొండ ఎమ్మెల్యే జయకృష్ణ, ఐటీడీఏ పీవో యశ్వంత్‌కుమార్‌రెడ్డి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే జయకృష్ణ

భామిని, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం గుర్తించిన ఆశావహ మండలం భామినిని అందరం కలిసికట్టుగా అభివృద్ధి చేద్దామని ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ, ఐటీడీఏ పీవో యశ్వంత్‌కుమార్‌రెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో అధికారులతో శాఖల వారీగా సమీక్షించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం భామిని మండలం అభివృద్ధికి రూ.1.5 కోట్లు ప్రోత్సాహం ప్రకటించడం గర్వకారణమన్నారు. ఐటీడీఏ పీవో మాట్లాడుతూ మండల అభివృద్ధికి అన్ని శాఖల అధికారులు ఈనెల 5వ తేదీలోగా ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించారు. ఎనీమియా రోగ నివారణకు క్షేత్రస్థాయిలో ఉన్న మహిళా పోలీసులు కృషి చేయాలన్నారు. ఐటీడీఏ ఏపీవో జి.చిన్నబాబు, డీడీ అన్నదొర, తహసీల్దార్ అప్పారావు, ఎంపీడీవో చంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

మా బతుకులు రోడ్డున పడేయొద్దు

- చిరు వ్యాపారుల నిరసన

పార్వతీపురంటౌన్, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): ప్రధాన రహదారికి ఆనుకుని జీవిస్తున్న తమ బతుకులను రోడ్డున పడేయవద్దని చిరు వ్యాపారులు మంగళవారం స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద నిరసన చేపట్టారు. సాధారణ సమావేశానికి కార్యాలయానికి వచ్చిన మున్సిపల్ ఛైర్‌పర్సన్ గౌరీశ్వరీ, కమిషనర్ శ్రీనివాసరాజు, కౌన్సిల్ సభ్యులను సమావేశ మందిరంలోకి వెళ్లనీయకుండా అడ్డుకున్నారు. ఇంతలో పట్టణ సీఐ మురళీధర్, పోలీసు సిబ్బంది అక్కడకు చేరుకోవడంతో స్వల్ప ఉద్రిక్తత నెలకొంది. మున్సిపల్ కమిషనర్, ఛైర్‌పర్సన్, సీఐ చర్చలు జరిపిన అనంతరం చిరు వ్యాపారులకు పండగ సమయంలో ఇబ్బందులు పెట్టకుండా తగిన ప్రణాళికలు సిద్ధం చేస్తామని స్పష్టం చేశారు. దీంతో చిరు వ్యాపారులు నిరసన కార్యక్రమాన్ని విరమింపజేశారు.

జీతాలు చెల్లించండి

సాలూరు, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ కార్మికులకు తక్షణం జీతాలు చెల్లించాలని మున్సిపల్ కౌన్సిల్ సభ్యులు మున్సిపల్ కమిషనర్‌ను కోరారు. మంగళవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో ఛైర్‌పర్సన్ పువ్వల ఈశ్వరమ్మ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా మున్సిపల్ అధికారులు అజెండా చదివి వినిపించారు. మున్సిపాల్టీలో ఉద్యోగులు నియామకానికి సంబంధించి అంశం రాగా, ప్రస్తుతం పని చేస్తున్న మున్సిపల్ కార్మికులకు జీతాలు, బకాయిలు చెల్లించటం లేదు కానీ కొత్త ఉద్యోగాలు ఎందుకని పలువురు కౌన్సిలర్లు ప్రశ్నించారు. అలాగే మున్సిపాల్టీలో సాధారణ నిధులు ఎంత వస్తున్నాయో.. ఎంత ఖర్చు చేస్తున్నారో ఎవరికీ తెలియదని కౌన్సిలర్లు అధికారులను ప్రశ్నించారు. తాను ఎన్నిసార్లు మున్సిపల్ సర్వసభ్య సమావేశంలో తన వార్డు సమస్యలు చెప్పినా ఎవ్వరూ పట్టించుకోవటం లేదని కౌన్సిలర్ సింగారపు ఈశ్వరరావు అధికారుల తీరును తప్పు పట్టారు.


పింఛన్ల పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే జగదీశ్వరి, టీడీపీ నాయకుడు వీరేశ్ చంద్రదేవ్

పింఛన్ల పంపిణీ

కురుపాం/ రూరల్, డిసెంబరు 31(ఆంధ్ర జ్యోతి): సామాజిక పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో కురుపాం ఎమ్మెల్యే తోయిక జగదీశ్వరి ఆదివారం పాల్గొన్నారు. గుమ్మ గ్రామంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వైరిచర్ల వీరేశ్ చంద్రదేవ్‌తో కలిపి ఆమె పింఛన్లు పంపిణీ చేశారు. పార్టీ నాయకులు వెంపటాపు భారతి, రంజిత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తా

గుమ్మలక్ష్మీపురం, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): కురుపాం నియోజకవర్గం అభివృద్ధికి చిత్తశుద్ధితో పనిచేస్తానని ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి అన్నారు. ఆమె మంగళవారం స్థానిక విలేకర్లతో మాట్లాడారు. నూతన సంవత్సరంలో నియోజకవర్గ అభివృద్ధిని ఆకాంక్షిస్తున్నామని చెప్పారు. యువతకు ఉపాధి, కొండ శిఖర గ్రామాలకు రహదారులు, పూర్ణపాడు, లాబేసు వంతెన నిర్మాణం, చెక్‌డ్యామ్‌ల నిర్మాణాలు ఇతర సాగునీటి వనరుల నిర్మాణాలు.. తదితర అంశాలపై దృష్టి సారిస్తామని తెలిపారు.

పత్తి కొనుగోలు ప్రారంభం

భామిని, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): భామిని మార్కెట్ యార్డు ప్రాంగణంలో సీసీఐఎల్ ఆధ్వర్యంలో మంగళవారం పత్తి కొనుగోలు ప్రారంభించారు. ఆన్‌లైన్‌లో కొనుగోలు చేస్తున్నామని కొనుగోలు అధికారి అతుల్ తెలిపారు.

నూతన సంవత్సర శుభాకాంక్షలు
శంఖు చక్ర జ్యూయలర్స్
మెయిన్‌రోడ్, పార్వతీపురం, సెల్ : 9966966838
పతివాడ రామారావు & ఫ్యామిలీ
పార్వతీపురం

నూతన సంవత్సర శుభాకాంక్షలతో.
పాలకొండ రైస్‌మిల్లర్స్ అసోసియేషన్
శ్రీ బాలాజీ మోడరన్ రైస్‌మిల్ పాలకొండ, మే॥పా॥ సుంకరి సుధాకర్, S/o SLR
శ్రీ సత్యనారాయణ మోడరన్ రైస్‌మిల్ పాలకొండ, ప్రొ॥నందా కరుణసాగర్, S/o సత్యనారాయణ
శ్రీ అప్పన్న మోడరన్ రైస్‌మిల్ పరుశురాంపురం, మే॥పా॥ లోడగల దుర్గారావు & బ్రదర్స్
శ్రీ భాగ్యలక్ష్మి మోడరన్ రైస్‌మిల్ పాలకొండ, ప్రొ॥డోకి కిషోర్, S/o సుదర్శనరావు
శ్రీ మాధవక్రిష్ణ మోడరన్ రైస్‌మిల్ పాలకొండ, ప్రొ॥మెరుగుల అప్పలనాయుడు
శ్రీ మారుతి మోడరన్ రైస్‌మిల్ తుమరాడ, ప్రొ॥పూణ్ణ చంటిబాబు
శ్రీ అప్పన్నమ్మ మోడరన్ రైస్‌మిల్ పాలకొండ, ప్రొ॥లోడగల సీతారాం
శ్రీ మణికంఠ మోడరన్ రైస్‌మిల్ వెలగవాడ, ప్రొ॥వెన్నపు శ్రీనివాసరావు

డ్రాపౌట్లను నివారించాలి

- డిప్యూటీ ఈవో రవి ప్రసన్నకుమార్

సీతంపేట రూరల్, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): పాఠశాలల్లో డ్రాపౌట్ల శాతం తగ్గించాలని డిప్యూటీ ఈవో రవి ప్రసన్నకుమార్ సూచించారు. స్థానిక గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికల ఉన్నత పాఠశాలను ఆయన మంగళవారం సందర్శించారు. ఈసందర్భంగా ఎస్ఎస్‌సీ పరీక్షల యాక్షన్ ప్లాన్‌పై ఉపాధ్యాయులతో సమీక్షించారు. అనంతరం విద్యార్థినిలతో మాట్లాడి వారి విద్యా ప్రమాణాల స్థాయిని పరిశీలించారు. బడి బయట ఉన్న పిల్లలను పాఠశాలకు తీసుకువచ్చేందుకు అందరూ సహకరించాలని కోరారు. ఈ సమీక్షలో ఎంఈవో ఆనందరావు, జీసీడీవో రాములమ్మ, హెచ్ఎం వసంత తదితరులు పాల్గొన్నారు.

కష్టపడి చదివితే ఉత్తమ ఫలితాలు

సీతంపేట రూరల్, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): కష్టపడి, ఇష్టపడి చదివితే ఉత్తమ ఫలితాలు సాధించ వచ్చునని సీతంపేట ఐటీడీఏ ఇన్‌చార్జి పీవో సి.యశ్వంత్‌కుమార్‌రెడ్డి అన్నారు. ఆర్ఫ్ ఎన్జీవో ఆధ్వర్యంలో ఢిల్లీ నుంచి వచ్చిన విద్యార్థులతో స్థానిక ఐటీడీఏ కార్యాలయంలో ఆయన మంగళవారం ముచ్చటించారు. తాను సివిల్స్‌లో విజయం సాధించడానికి దోహదపడిన అంశాలపై విద్యార్థులతో పంచుకున్నారు. ఏపీవో జి.చిన్నబాబు, ఏవో సునీల్, డీడీ అన్నదొర, ఆర్ఫ్ ఎన్‌జీవో సంస్థ డైరెక్టర్ ఎన్.సన్యాసిరావు తదితరులు పాల్గొన్నారు.

ఉచితంగా వెన్నెముక శస్త్రచికిత్స


మాట్లాడుతున్న విజయ ఆసుపత్రి ఎండీ పద్మావతి

పాలకొండ, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని విజయ మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రిలో మొదటిసారిగా డాక్టర్ హితీస్ అక్షయరాజ్(ఎంఎస్ ఆర్థో) నేతృత్వంలో పెద్దబుడ్డిడి గ్రామానికి చెందిన కర్రి సీతమ్మ అనే మహిళకు ఎన్టీఆర్ ఆరోగ్యశ్రీ ద్వారా ఉచితంగా వెన్నెముక శస్త్రచికిత్స చేశారు. ఈ మేరకు ఆసుపత్రి ఎండీ దూబ పద్మావతి మంగళవారం విలేకర్ల సమావేశం నిర్వహించారు. శస్త్ర చికిత్స చేసిన అక్షయరాజ్, మత్తు వైద్యుడు బి.శరత్ చంద్రలను అభినందించారు. ప్రతిఒక్కరికీ మెరుగైన వైద్య సేవలు అందించేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. ఆస్పత్రిలో 24 గంటల ఎమర్జెన్సీ వైద్యం అందుబాటులో ఉంటుందని ఆమె తెలిపారు. వైద్యులు సంపత్‌కుమార్, అనుపమల తో పాటు మేనేజర్ కె.ధర్మారావు పాల్గొన్నారు.

బదిలీ ఉత్తర్వులు వెనక్కి తీసుకోండి

పార్వతీపురంటౌన్, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): ఏపీఎస్ ఆర్టీసీ డిపోలకు ఇటీవల అధికారులు పంపిన బదిలీ ఉత్తర్వులను వెనక్కి తీసుకోవాలని పార్వతీపుర ఎంప్లాయిస్ యూనియన్ మన్యం జిల్లా అధ్యక్షుడు ఎం.శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం స్థానిక డిపో గేటు వద్ద సంఘ సభ్యులతో కలిసి నిరసన తెలిపారు. 1/2019 సర్క్యులర్‌లను అమలు చేయాలన్నారు డిపో వర్కింగ్ ప్రెసిడెంట్ టీవీ నాయుడు, డిపో సెక్రటరీ నర్సింగరావు, నాయకులు పీఎల్ నాయుడు, జి.శ్రీనివాస్, శంకర్, టీకేఎస్ రావు తదితరులు పాల్గొన్నారు. ● పాలకొండ, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): సర్క్యులర్‌ను పక్కనపెట్టి కొంతమంది ఆర్టీసీ అధికారులను అక్రమంగా సస్పెండ్ చేయడం తగదని ఎంప్లాయిస్ యూనియన్ జోనల్ కార్యదర్శి భాసూరు కృష్ణమూర్తి అన్నారు. పాలకొండ బస్సు డిపో వద్ద భోజన విరామ సమయంలో మంగళవారం గేట్ మీటింగ్ నిర్వహించారు. చిన్నచిన్న పొరపాట్లుకు క్రమశిక్షణా చర్యలు తీసుకోవడం తగదని కృష్ణమూర్తి అన్నారు. జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ డి.దుర్గారావు, డిపో ప్రెసిడెంట్ ఎంవీ సాగర్, డిపో వర్కింగ్ ప్రెసిడెంట్ వి.వెంకటరమణ, డిపో సెక్రటరీ ఎల్.దామోదర్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

తాత్కాలికంగా సమ్మె విరమణ

సీతంపేట రూరల్, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): గురుకుల పాఠశాలల కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఉపాధ్యాయులు తమ సమస్యల పరిష్కారం కోరుతూ గత కొన్ని రోజులుగా చేస్తున్న సమ్మెకు తాత్కాలిక విరామం ఇచ్చారు. మంగళవారం స్థానిక ఐటీడీఏ కార్యాలయ ప్రధాన గేటు వద్ద నిర్వహిస్తున్న దీక్షా శిబిరం వద్దకు ఏజేఏసీ, యూటీఎఫ్ నాయకులు బి.శ్రీనివాసరావు, ఉమామహేశ్వరరావు, కె.క్రిష్ణారావు చేరుకుని, ఉపాధ్యాయులకు నిమ్మరసం ఇచ్చి సమ్మెను విరమింపజేశారు.

యామలపల్లి సత్యంనాయుడు
ఏపిఓ (తెలుగు) ఐటీడీఏ, పార్వతీపురం

నూతన సంవత్సర శుభాకాంక్షలతో....
2025
పార్వతీపురం పురపాలకసంఘం
అభివృద్ధి నివేదిక
2024-25
1) రాబోవు 30 సంవత్సరాలకు ప్రణాళికతో పట్టణములో మంచినీటి ఎద్దడి నివారించుటకు గాను రూ.64.00 కోట్లుతో సదరు ప్రాజెక్టు పనికి టెండర్లు పక్రియ పూర్తి అయినది. సర్వే జరుగుచున్నది. త్వరలో పని మొదలు పెట్టబడును. 2) పార్వతీపురం పురపాలక సంఘములో అన్నా క్యాంటిన్ పునరుద్ధరణచేయడం జరిగినది. 3) పార్వతీపురం పట్టణ సుందరీకరణలో భాగంగా 21.58 లక్షలతో మొక్కలను నాటి వాటి సంరక్షణకు చేపట్టుటకు టెండర్లు పిలువట జరిగినది. 5) 15వ ఆర్థిక సంఘం 2021-22 సంవత్సరము టైడ్ గ్రాంటు మొదటి విడతగా రూ.190.19 లక్షలుతో వాటర్ సప్లయికి సంబంధిత అభివృద్ధి పనులకు 1 నుండి 30వార్డుల యందు చేపట్టుట జరుగుచున్నది. 6)15వ ఆర్థిక సంఘం 2021-22 సంవత్సరము అన్ టైడ్ పనులు రెండవ విడతగా రూ.126.79 లక్షలుతో 14 పనులు చేపట్టుట జరుగును.7) పార్వతీపురం పురపాలక సంఘ పరిధిలో 15వ ఆర్థిక సంఘ నిధులతో స్మార్ట్ స్ట్రీట్ క్రింద 28.00 లక్షలు మరియు పురపాలక సంఘ సాధారణ నిధులతో 10.00 నిధులు మొత్తం 38.00 లక్షలతో గవర్నమెంట్ జూనియర్ కాలేజీ రోడ్డు మరియు కలెక్టరు ఆఫీసు రోడ్డును స్మార్ట్ స్ట్రీట్‌గా అభివృద్ధి చేయుట అంచనాలు చేపట్టుట జరుగుచున్నది. 8) హౌసింగ్‌నకు సంబంధించి 2739 మంది లబ్ధిదారులకు గాను ఇంటి స్థలం పట్టాలను మంజూరుచేసి 1711 మంది లబ్ధిదారులకు వారికి కేటాయించిన స్థలములలో ఇంటి పనిని ప్రారంభించడం జరిగినది. టిడ్కో ద్వారా 768 మంది లబ్ధిదారులకు ఇండ్లుకట్టి ఇవ్వబడును. 9) పార్వతీపురం పురపాలక సంఘంనకు విడుదలైన యు.పి.హెచ్.సి. గ్రాంటు రూ.90.00 లక్షలుతో చాకలి బెలగాంలో యు.పి. హెచ్. భవనం క్రొత్తగా నిర్మాణం జరుగుచున్నది మరియు జగన్నాథపురంలో గల యు.పి.హెచ్ మరమ్మత్తుల పని రూ.10.00 లక్షల అంచనా విలువతో పూర్తి చేయుట జరిగినది. 10) 2024-25 ఆర్థిక సంవత్సరములో 1232 మహిళా సంఘాలకుగాను ఎప్రిల్-2024 నుండి ఇప్పటి వరకు 234 సంఘాలకు 25 కోట్ల 65 లక్షలు రూపాయలు బ్యాంకు లింకేజీ రూపములో ఋణాలు ఇవ్వడం జరిగినది. 11) 2024-25 ఆర్థిక సంవత్సరములో అర్హులైన 720 మంది వీధి విక్రయదారులకు రూ.20,000/-లు చొప్పునరూ. రూ.1,44,00,000/-లు మరియు రూ.50,000/- చొప్పున రూ.15,00,000 పి.యమ్.స్వానిధి ఋణాలు మంజూరు చేయడం జరిగినది. 12) పార్వతీపురం పురపాలక సంఘమునకు సంబంధించి యన్.టి.ఆర్.భరోసా, ఫించన్లులలో భాగముగా వృద్ధాప్య, వితంతు,దివ్యాంగులకు ఫించనలు 4968 మందికి రూ.2,14,56,000/-లు నెలవారి పంచడం జరుగుచున్నది 13) 2024-25 ఆర్థిక సంవత్సరములో 830 మహిళా సంఘాలకు గాను రూ.5,98,00,000/- వైఎస్సార్ ఆసరా.ఋణాలు మంజూరు చేయడం జరిగింది. 14) 2024-25 ఆర్థిక సంవత్సరములో 1010 మహిళా సంఘాలకు గాను రూ.1,10,60,000/- వైఎస్సార్ సున్న వడ్డీ ఋణాలు మంజూరు చేయడం జరిగింది పార్వతీపురం పురపాలక సంఘం
జి.శ్రీనివాసరావు
కమీషనరు

నామమాత్రంగా సాధారణ సమావేశం

పార్వతీపురంటౌన్, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): స్థానిక మున్సిపల్ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన సాధారణ సమావేశం నామమాత్రంగా సాగింది. మున్సిపల్ ఛైర్‌పర్సన్ బోను గౌరీశ్వరీ ఆధ్వర్యంలో ఉదయం 11 గంటలకు ప్రారంభం కావాల్సిన మధ్యాహ్నం 12.30 గంటలకు ప్రారంభం అయింది. పట్టణ ప్రధాన రహదారిలో ట్రాఫిక్ ఆంక్షల పేరుతో తమను వేధించడం సరికాదంటూ చిల్లర వ్యాపారులు మున్సిపల్ కార్యాలయం వద్ద నిరసన చేపట్టడంతో సమావేశం ఆలస్యమైంది. అజెండాలోని 22 అంశాలపై అధికార, ప్రతిపక్ష కౌన్సిలర్లు ఆమోదం, తీర్మానాలు చేయకముందే సమావేశం ముగిసింది. పట్టణ ప్రధాన రహదారిలో చిల్లర వ్యాపారులకు న్యాయం చేయలేదంటూ వైసీపీ కౌన్సిలర్లు ఛైర్‌పర్సన్ గౌరీశ్వరీతోపాటు మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరాజుపై విమర్శనాస్త్రాలు గుప్పించారు.

ఘనంగా ఏకపాత్రాభినయ పోటీలు


హరిశ్చంద్ర పాత్రలో..

పార్వతీపురంటౌన్, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేటు కల్యాణ మండపంలో మంగళవారం నిర్వహించిన ఉత్తరాంధ్ర పౌరాణిక పద్య ఏకపాత్రాభియ పోటీలు ఔరా అనిపించాయి. ఉత్తరాంధ్ర పౌరాణిక పద్య నాటక కళాకారుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఈ పోటీలు నిర్వహించారు.

కళాకారులకు అండగా ఉంటా..

ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర మాట్లాడుతూ కళాకారులకు అండగా ఉంటానని అన్నారు. జిల్లాలో పౌరాణిక కళాకారుల అభ్యసన భవనం కోసం 50 సెంట్ల భూమిని కేటాయించాలని రెవెన్యూ అధికారులకు ప్రతిపాదిస్తున్నామని చెప్పారు. అనంతరం ఉత్తరాంధ్ర పౌరాణిక పద్య నాటక కళాకారుల సంక్షేమ సేవా సంఘ అధ్యక్షుడు బడే శ్రీరాములనాయుడు తోపాటు పలువురు కళాకారులను ఎమ్మెల్యే సన్మానించారు. ఆంధ్రప్రదేశ్ నాటక అకాడమీ ఛైర్మన్ జి.గోపాలకృష్ణ పాల్గొన్నారు. సంఘ కార్యదర్శి వి.మారుతీ ప్రసాద్, నిర్వాహకుడు ఎస్.సింహాచలం పాల్గొన్నారు.

7న ఎస్సీ కుల గణనపై అభ్యంతరాల స్వీకరణ

పార్వతీపురం, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ కుల గణన ఆడిట్‌పై స్టాండర్డ్ ఆపరేషన్ ప్రొసీజర్ ప్రభుత్వం విడుదల చేసిందని జిల్లా సాంఘిక సంక్షేమ శాఖాధికారి ఎండీ గయాజుద్దీన్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఎస్‌వోపీ విడుదల చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. ఈనెల 7న అభ్యంతరాలు స్వీకరిస్తామని తెలిపారు. అభ్యంతరాలను 11వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో నమోదు చేస్తామని చెప్పారు.